
ఆంధ్రభూమి

# సినిమా పత్రిక



9.1.1982

వెల రూ. 1-25


దాసరి నారాయణరావు
దర్శకత్వం
కె.వి.నందనరావు
నూతన సంవత్సరంలో వినోదాల కానుక!
తారకప్రభు ఇంటర్ నేషనల్
కలర్
నిర్మాత: కె. బసవయ్య
సంగీతం: రమేష్ నాయుడు
ఫోటోగ్రఫీ: కె. యస్. హరి
లక్ష్మి ఫిలింస్
LAKSHMI PUBS

## సినిమాపత్రిక-బాంబేడయింగ్

# అందాలపోటీ

సుప్రసిద్ధ టెక్స్‌టయిల్ సంస్థ బాంబే డయింగ్ సహకారంతో సినిమాపత్రిక ఉత్సాహవంతులయిన యువతీయువకులకు అందాల పోటీ నిర్వహిస్తున్నదని ప్రకటించడానికి సంతోషిస్తున్నాము.

........ * పోటీ నియమనిబంధనలు * ........

1. పోటీలో 16-22 మధ్య్ వయసు గల యువతీయువకులు మాత్రమే పాల్గొనాలి.
2. ఈ క్రింద ఇచ్చిన కూపన్‌లో వివరాలు పూర్తిచేసి దాంతోపాటు ఒకపాస్‌పోర్టుసైజు (బస్ట్), ఒక కార్డుసైజు (ఫుల్) ఫోటోలో పంపించాలి.
3. ఆవారం వచ్చిన ఫోటోలలో బాగున్నవాటిని కొన్ని వారం, వారం సినిమాపత్రికలో ప్రచురిస్తూ ఉంటాం.
4. ఎన్నిక పాఠకులదే. ఈ సందర్భంగా పాఠకులు పాల్గొనడానికి ఒకపోటీని కూడా ఏర్పాటు చేస్తున్నాము. ఈ వివరాలు పాఠకుల పోటీ ప్రకటనలో ఇస్తాము
5. అందాలపోటీ తుదిఎన్నిక హైదరాబాద్ లో జరుగుతుంది. పోటీలో ఎన్నికయిన వారికి బాంబేడయింగ్, సినిమాపత్రికల తరపున అత్యంత ఆకర్షణీయమైన సన్మానం ఉంటుంది.
6. యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొని ఈ పోటీని విజయవంతం చెయ్యగోర్తాము
7. ఎన్నికయినవారికి ఈ క్రింది బాంబే డయింగ్ షోరూమ్స్‌వారు బహుమతులు ఇస్తారు.

| | |
|---|---|
| ★ అన్నపూర్ణ, చిక్కడపల్లి, హైదరాబాద్. | ★ కుందన్స్, లక్‌డీకాపూల్, హైదరాబాద్. |
| ★ శ్రీలక్ష్మి, స్టేషన్‌రోడ్, కొత్తగూడెం | ★ లక్ష్మి, సుభాష్‌రోడ్, అనంతపూర్ |
| ★ పూర్ణచంద్ర, వై. వి. స్ట్రీట్, కడప. | ★ శారద, గాంధీరోడ్, తిరుపతి. |
| ★ కల్యాణ్, ప్రకాశంరోడ్, ఖమ్మం. | ★ దిండియా, జవహర్‌రోడ్, నిజామాబాద్. |

---

సినిమా పత్రిక-బాంబే డయింగ్

అందాల పోటీ

పేరు ______________________________

అడ్రసు ______________________________

______________________________

______________________________

వయస్సు ________ ఎత్తు ________ బరువు ________

ఎడిటర్
పబ్లిషర్
టి. చంద్రశేఖరరెడ్డి

*

డెప్యూటీ ఎడిటర్
సి. కనకాంబరరాజు

*

చీఫ్ రిపోర్టర్
మోహన్‌కుమార్
అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్
పి. శేషగిరిరావు
సర్క్యులేషన్ మేనేజర్
ఎ. వి. యల్. నరసింహారావు.

ఆంధ్రభూమి
సినిమా పత్రిక
పోస్టు ద్వారా
సంవత్సర చందా రు. 67.00
ఆరు నెలలకు రు. 33.80.

అడ్రసు
36, సరోజినిదేవి రోడ్డు
సికిందరాబాదు 500 003
ఫోన్ : 76346

మద్రాసు ఆఫీసు
46, హబిబుల్లారోడ్డు
టి. నగర్, మద్రాసు 600017

విజయవాడ ఆఫీసు
28_6_2 కాంగ్రెస్ ఆఫీసురోడ్డు
విజయవాడ 520002
ఫోన్ : 63585

ఆంధ్రభూమి
సినిమా పత్రిక

సంపుటి 1 | 9-1-1982 | సంచిక 3

# చలనచిత్రాల స్థాయి

"మన దేశంలోవున్నది దారిద్ర్యం ఒక్కటే కాదు. ప్రపంచంలో అత్యున్నతమైన సంస్కృతికూడా వుంది" అన్నారు ప్రముఖ నిర్మాత కృష్ణషా ఒక సందర్భంలో సత్యజిత్‌రే గురించి మాట్లాడుతూ.

మేధావులకోసం తీసినచిత్రాలు 'ఆర్ట్ ఫిల్మ్స్' అని, ప్రజలకోసం తీసిన చిత్రాలు 'కమర్షియల్ ఫిల్మ్స్' అని మనవారు నామకరణం చేసేశారు.

సత్యజిత్‌రే చిత్రాలన్నింటినీ అగ్రశ్రేణి చిత్రాలుగా ప్రపంచంలో మేధావులంతా ప్రశంసించారు. ఈ చిత్రాలు మనదేశంలో ఎంతవరకు విజయవంతమైనాయి; అని ప్రశ్నించుకుంటే జవాబు మనకు చాలా ఆశ్చర్యంగా వుంటుంది.

సత్యజిత్‌రే చిత్రాలకు విదేశాల్లో మంచి గిరాకీవుంది. ఈ చిత్రాలుచూసి భారతదేశం అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ దరిద్రపు దేశంగానే విదేశీయులు భావిస్తూ వుంటారు.

సహజత్వం వుట్టిపడుతున్నదని చెప్పబడే సత్యజిత్‌రే చిత్రాలలోవున్న కథావస్తువు మనదేశంలో ఎంత శాతం మందికి సంబంధించినది? నూటికీ కోటికీ జరిగే ఒక సంఘటనపై చిత్రాలు నిర్మించి ఇదే మా దేశం అని చూపిస్తే విదేశీయుల దృష్టిలో మనం ఎంత చులకన అయిపోతాం?

సరిగ్గా ఇదే విషయంపై శ్రీమతి నర్గీస్ ఒకసారి వ్యాఖ్యానించినప్పుడు అనేక విమర్శలకు లోనయ్యింది.

సినిమా అనేది వినోదాత్మకంగానే కాదు. విజ్ఞానాత్మకంగా కూడా వుండాలనేది అంతా ఒప్పుకునే విషయమే.

విజ్ఞానంకోసం నిర్మించిన చిత్రాలలో వినోదం కొరవడవచ్చు (ఇలాంటి చిత్రాలు చాలా తక్కువ) గాని, వినోదంకోసం నిర్మించిన చిత్రాలలో తప్పకుండా విజ్ఞానం వుంటూనే వుంటుంది.

అలాగని, ఇప్పుడు విడుదల అవుతున్న ప్రతిచిత్రాన్నీ సమర్థించడం కాదుఇది.

చిత్రాలస్థాయి దిగజారిపోతున్నదని ఇటీవల టాకీ స్వర్ణోత్సవాలలో నాయకులంతా వాపోయారు. ఈ 'స్థాయి' అనే దాన్ని ఎలా నిర్దేశిస్తారో అర్థంకాదు. సత్యజిత్‌రే చిత్రాలనుబట్టా? వ్యాపారరీత్యా విజయవంతమైన చిత్రాలనుబట్టా?

"డబ్బులిచ్చి ఏడుపునెందుకు కొనుక్కోవాలి. సినిమా చూసేది కేవలం వినోదానికే" అనేది మామూలు ప్రేక్షకుడి అభిప్రాయం.

"బాగా డబ్బుచేసుకున్నదే మంచి చిత్రం" అంటారు ఎన్టీ రామారావు.

ప్రయోగమూ, ప్రయోజనమూ ప్రతి చిత్రంలోనూ వుంటూనే వుంటుంది. కారణంటే, ఇది ప్రేక్షకుడి బుద్ధివికాసాన్నిబట్టి, మానసిక పరిణతనుబట్టి అర్థమవుతూ వుంటుంది.

టి. చంద్రశేఖరరెడ్డి

# ఈ వారం విశేషాలు




✱ పెళ్ళయిన తారలు
నటజీవితంలో
ఎలారాణిస్తారు ?
14 —జయసుధ



✱ రజనీకాంత్ తెలుగు చిత్రాల్లో
ఎందుకు
నటించనంటున్నాడు ? —38



✱ నటీ శిరోమణి అంతిమయాత్ర —8

✱ తారలతో పెట్స్ పైనా బయటా 20
✱ విదేశీ విచిత్రం 36
✱ తొలిమలుపు —23
✱ జవాబులు—జవాబులు —18
✱ స్టూడియో సంచారం —26


# వచ్చేవారం



✱ ముసలి పాత్రలకికూడా
గ్లామర్ తెచ్చిపెట్టే నటుడు
—శోభన



✱ 'నా పెళ్లెప్పుడో తెలుసా ?'
—కవిత

✱ బొంబాయి సినిమా—ప్రత్యక్ష కథనం
✱ దెయ్యంతో జయప్రద ముచ్చట్లు—పైవారం ప్రత్యేకం !
✱ తారల హావభావాలు—క్లోజప్ !

# దూరదర్శిని

మోహన్‌కుమార్



చలనచిత్రాకాశంనుంచి ఒక నక్షత్రం రాలిపోయింది
ఒక వెలుగు ఆరిపోయింది !
ఒక మంచి మనసు మనల్ని వీడి వెళ్ళిపోయింది.
ఒక మహానటిని పరిశ్రమ కోల్పోయింది !



రెండు దశాబ్దాలు మహానటిగా దక్షిణాది చలనచిత్ర పరిశ్రమలో వెలుగొందిన సావిత్రి గడచిన సంవత్సరం-మే 10, 1980న బెంగుళూర్‌లో ఒక కన్నడ చిత్రం షూటింగ్ నిమిత్తం వెళ్ళి, కోమాకు గురై అక్కడే ఆస్పత్రిలో చేర్చబడ్డారు. ఈ వార్త తెలిసిన ఆమె భర్త, ప్రముఖ నటుడు శ్రీ జెమినీ గణేశన్ ఆ ఆస్పత్రినుంచి తీసుకొచ్చి మద్రాసు లేడీ వెల్లింగ్టన్ ఆస్పత్రిలో చేర్చారు. అప్పట్నుంచీ శ్రీమతి సావిత్రి-ఈ సంవత్సరం ఏడు మాసాల పదహారురోజులూ అపస్మారక స్థితిలోనే వున్నారు. ఆహారం-గ్లూకోజ్, కొబ్బరినీరులాంటి ద్రవపదార్థాలను ముక్కుల్లోంచి ట్యూబ్స్‌ద్వారా లోపలికి పంపించేవారు డాక్టర్లు. ఆమెను ఆస్పత్రిలో చూసిన వారెవరూ-ఆమెను 'సావిత్రి'గా గుర్తించలేనంతగా మారిపోయారు.

* * *

1936 డిసెంబరు 6న విజయవాడలో శ్రీ కొమ్మారెడ్డి వెంకట్రామయ్యచౌదరి, శ్రీమతి దుర్గమ్మలకు జన్మించారు సావిత్రి. చిన్నప్పట్నుంచీ ఆమెకు లలితకళలపట్ల ఆసక్తి వుండేది. చిన్న వయసులోనే నాట్యంలో శిక్షితు

రాలైన సావిత్రి మొట్టమొదటి సారిగా 'సంసారం' చిత్రంలో నటించారు. నాగేశ్వరరావు, పుష్పలత అందులో జంటగా నటించారు. వారిద్దరితో ఆ చిత్రంలో మరో ముగ్గురు అమ్మాయిలతో కలసి సావిత్రి కారులో వెళుతూ నాగేశ్వరరావుగార్ని ఆటపట్టిస్తూ 'బాలరాజు హీరో, కీలుగుర్రం హీరో' అంటూ కేరింతలుకొట్టే చిన్న వేషం. ఆ తర్వాత విజయా వారి 'పాతాళభైరవి'లో కూడా చిన్నవేషం వేశారు.

ఆ తర్వాత నాగేశ్వరరావుతో నటించిన వినోదా వారి "దేవదాసు"లో ఆమెకు మేజర్ బ్రేక్ లభించింది.


నారాయణన్ కంపెనీ వారి విచిత్ర కుటుంబం, అప్పుచేసి పప్పుకూడు, నవరాత్రి, నమ్మిన బంటు, పాండవ వనవాసము, కంచుకోట, గుండమ్మకథ, సుమంగళి, నర్తనశాల, బ్రతుకుతెరువు,

## ాధపడినా కృతజ్ఞురాల్ని !

ఈ పై ఫొటో సావిత్రి నటజీవితంలో విశిష్టమైనది. అన్నపూర్ణా వారి "ఇద్దరు మిత్రులు" శతదినోత్సవ వేడుకలు 1962 ఏప్రిల్‌లో జరిగాయి. ఆ చిత్రం శతదినోత్సవ వేడుకల్లో బహుమతి ప్రదానానికివచ్చిన శ్రీమతి సావిత్రి మాట్లాడుతూ "అన్నపూర్ణా వారి అన్ని చిత్రాల్లోను ప్రముఖ పాత్ర నిర్వహించి యీ అయిదవ చిత్రంలో ఏ పాత్రా నిర్వహించలేకపోయినందుకు మొదట్లో బాధపడినా ఈ నాడు బహూమతి ప్రదానానికి నన్ను ఆహ్వానించి గౌరవించినందుకు నా కృతజ్ఞత!" అన్నారు.

"ఇద్దరు మిత్రులు"కు ముందు నిర్మించిన అన్నపూర్ణా వారి నాలుగు చిత్రాల్లోనూ ఆమే నాయిక. ఫొటోలో సావిత్రి ప్రసంగిస్తున్నపుడు వెనుక వరుసలో ఆసీనులైనవారు వరుసగా శ్రీమతి పి. సుశీల, సూర్యకాంతం, శారద, జి.వరలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డి.





"మనంపోల మాంగల్యం" (అల్లుడుచేసిన అల్లరి) చిత్రంలో సావిత్రి నటిస్తున్నప్పుడు ఆ చిత్ర కధానాయకుడు శ్రీ జెమినీ గణేశన్‌ను ప్రేమించి, వివాహం చేసుకున్నారు. వారిద్దరికీ కలిగిన సంతానం విజయచాముండేశ్వరి, సతీష్‌కుమార్, విజయచాముండేశ్వరికి వివాహం అయింది. ఒక కుమార్తె. సతీష్‌కుమార్ చదువుకుంటున్నాడు.

* * *

దక్షిణ భారత భాషలన్నింటిలోను కలిపి శ్రీమతి సావిత్రి 200 చిత్రాలలో నటించారు. ఆమె నటించిన చిత్రాలలో దేవదాసు, దొంగరాముడు, తోడికోడళ్ళు, మాంగల్యబలం, వెలుగునీడలు, మాయాబజార్, మిస్సమ్మ, అర్ధాంగి, వెంకటేశ్వరమహాత్యం, సిరిసంపదలు, మంచిమనసులు, మూగమనసులు, రక్తసంబంధం, డా॥ చక్రవర్తి మున్నగునవి తెలుగులో బాక్సాఫీస్ హిట్స్.

* * *

నటిగా పేరు ప్రఖ్యాతులతో పాటు డబ్బుకూడా సంపాయించారామె. ఒకప్పుడు మద్రాసు నగరంలో ఆమెకు ఏడెనిమిదిళ్ళు గార్డెన్స్ వుండేవి. కార్లు, నౌకర్లు, చాకర్లు ఎంతో హుందాగా, దర్జాగా బ్రతికారామె.

ఒకనాడు సిరిసంపదలతో తులతూగిన ఆ మహా నటీమణి చరమదశలో అణ్ణానగర్‌లో అద్దె కొంపలో బ్రతకవలసి వచ్చింది. విధి ఆమెను చిన్నచూపుచూసి, ఆమె సంపదను కాటేసినా, ఆమె కళా సంపన్నతను కాటేయలేకపోయింది.

* * *

ఆ మహానటి జ్ఞాపకాలు మన మనసులనిండా మిగిలిపోయాయి. అవి మనల్ని వీడిపోవు, ఎప్పటికీ వాడిపోవు!!



# తారామణీ ఇక తిరిగిరావమరి?

గత ఒకటిన్నర సంవత్సర కాలంగా స్పృహలేని పరిస్థితిలో వున్న నటి శిరోమణి సావిత్రి డిశంబరు 26 వ తేదీ రాత్రి పదకొండుగంటలకు భర్త జెమినీగణేశన్ కరశీతల స్పర్శ లలాటానికి సోకుతుండగా మరణించింది.

పిల్లలు చాముండేశ్వరి, సతీష్ "అమ్మా అమ్మా !!" అంటూ ఆక్రోశిస్తూ తల్లడిల్లుతున్నా, ఏడ్చి ఏడ్చి, కనుల నీరు యింకిన భర్త, స్నేహితులు, సన్నిహితులు, ఆప్తులు నిస్సహాయంగా విలవిలలాడుతున్నా, నికృష్టపు మృత్యుదేవతకు కరుణలేక, కరకుకసాయి హస్తాలతో అశేష ప్రజానీకం ప్రియసోదరిని కబళించింది.



* * *

పోయిన సంవత్సరం 'మే' నెలలో ఒక చిత్రం షూటింగ్ కోసం, బెంగళూరుకు వెళ్ళినపుడు హఠాత్తుగా హోటల్‌రూంలోకళ్ళు తిరిగి, స్పృహ కోల్పోయారు. ఆనాడెంత దుర్దినమో ! నాటినుండి మరణం సంభవించేవరకూ స్పృహలేకుండా "కోమా"లో వుండి, మంచంపట్టారు.

మరణానికి పదిహేనురోజులు ముందే సావిత్రి పరిస్థితి తీవ్రంగా విషమించేసరికి, నుంగంబాకంలో వున్న హాస్పిటల్‌లో ఆవిడ్ని చేర్పించారు.

26 వ తారీఖునాడు రాత్రి పది గంటలకు మృత్యు సమీపంలో వున్న సావిత్రి దగ్గరకు వచ్చారు భర్త జెమిని.

కళ్ళుతెరిచి, ఒక్కసారి భర్తను పిల్లల్నిచూసినా వాళ్ళకెంతో ఊరట లభించి వుండేది. నిస్సహాయస్థితిలో వాళ్ళు విలపిస్తుండగా పదకొండు గంటలకు ప్రాణాలు విడిచింది.


## అంతిమ దర్శనం

సావిత్రి భౌతికదేహాన్ని నెం. 6, నుంగంబాకం హై రోడ్డులో వున్న జెమినీగణేశన్ యింట్లో ప్రజలదర్శనార్థం వుంచారు. తమ అభిమాన నటి అంతిమ దర్శనం కోసం జనం తండోపతండాలుగా వచ్చారు. నిట్టూర్పులతో, నిస్పృహలతో దుఃఖంతో నిలువెల్లా కంపిస్తున్న అభిమానులు.



## తెలుగు ఆడబిడుచు తమిళుల కోడలు!

సావిత్రి నటించిన నూరవ చిత్రం "కొంజుమ్ శెలంగై"



మొదటిసారిగా అతి ఖరీదయిన కారునుఉపయోగించింది సావిత్రే! ఎడంచేత్తో విలాసంగా స్టీరింగ్ పట్టుకుని, గంటకి ఎనభై మైళ్ళస్పీడుతో, అతి చాకచక్యంతో కారును నడిపే సామర్థ్యవంతురాలు సావిత్రి.

## దర్శకురాలిగా

తెలుగులో 'చిన్నారి పాపలు' చిత్రానికి, తమిళంలో 'పాత్తం'

తను గర్వంగా తలెత్తుకోడానికి కారణభూతురాలైన నటి శిరోమణిని, దారుణంగా మృత్యు దేవత కబళించిందని, తనకి కఠోర పిశాచ నినాద ఘోషా హేషల్ని మాత్రం మిగిల్చిందని, నెత్తి బాదుకుంటూ, గుండెలు పగిలేటట్టు రోదిస్తున్న శబ్దం, స్తంభించిన ప్రకృతి నుండి, స్తబ్దతనుండితేరుకుంటున్న భగవంతుడు—



(మురిపించే మువ్వలు) నూట యాభైయ్యవ చిత్రం "సీత".

"నేమ తెలుగువారి ఆడపడుచునైనా. తమిళులకోడల్ని" అంటూ



వుండేవారామె జెమినీగణేశన్‌తో.

## ప్రజాహిత కార్యక్రమాల్లో ముందంజ

తెలుగు, తమిళ చిత్రాల్లో ఎంతో బిజీగా వుండే సావిత్రికి నాటకాలు వెయ్యడానికి సమయం దొరికేదికాదు. అందువల్లనే ఆవిడ ఎక్కువ నాటకాలు వెయ్యలేకపోయింది. భారత్-చైనా యుద్ధం జరిగినప్పుడు, నిధి

వసూలు చెయ్యడానికై 'గలాటా కల్యాణం' అనే నాటకాన్ని ప్రదర్శించి, వసూలయిన డబ్బును ప్రభుత్వానికి అందజేశారు.

## నటి శిరోమణి

ఆంధ్ర మహిళా సంఘంవారు ఒక ఫంక్షన్‌లో 'నటి శిరోమణి' బిరుదును సావిత్రికిచ్చారు. అలాగే మద్రాసు సినీ అభిమానులు 'నడిగయర్ తిలగం' అనే బిరుదును ఇచ్చి గౌరవించారు.

## ఎడంచేతి అలవాటు

ఎడంచేత్తో రాయడం సావిత్రి అలవాటు. మన నటీమణుల్లో




(మూగమనసులు) చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ రెండు చిత్రాలు ఆశించినంతగా విజయం పొందలేదు.

ఈ మహానటి మరణానికి దుఃఖించని మనస్సంటూ లేదు.

'జాతస్య హి ధ్రువో మరణం' అంటాడు కాబోలు. ఆయన అంతకన్నా మరొకటేమనగలడు?


—ఎల్యూనారాయణ్రావ్

# మహానటి అంతిమ యాత్ర

1981 డిసెంబర్ 26న ఓ మహానటిని మృత్యువు ఆవరించింది. ఇది చలనచిత్ర చరిత్రలో మరచిపోలేని విషాద సంఘటన.

మహానటి అనగానే అందరి కళ్ళముందూ సావిత్రి రూపం కనిపిస్తుంది.


సినిమా అంటే తెలిసిన ప్రతి ఒక్కరికీసావిత్రినిగురించితెలుసు. నటనఅంటే ఏమిటో తెలిసిన వారికీ, తెలియని వారికీకూడా సావిత్రిలోని మహోన్నతమైన



నటన గురించి తెలుసు. ఏ పాత్రనైనా అవలీలగా పోషించి, ఆ పాత్ర సృష్టించిన రచయితకే దిగ్భ్రాంతి కలిగించే అపూర్వ నటనాసామర్థ్యం ఒక్క సావిత్రిలోనేవుంది.

సావిత్రి మరణవార్త వినగానే బాధపడనివారెవరుంటారు? కంటతడిపెట్టని వారెవరుంటారు?

ఆవార్త విన్న పరిశ్రమ, ప్రేక్షకులు కన్నీటిసాగరంలో మునిగిపోయారు. సావిత్రిని కడసారిచూడటానికివచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎం. జి. రామచంద్రన్ పి. పుల్లయ్య, దాసరి నారాయణరావు, అక్కినేని నాగేశ్వరరావు, భారతీరాజా, మురళీమోహన్,



గుమ్మడి, ప్రభాకరరెడ్డి, అల్లు రామలింగయ్య, జయసుధ, వాణిశ్రీ, కె. ఆర్. విజయ, జానకి, బి. సరోజాదేవి, జయశంకర్, కాంతారావు, బాలకృష్ణ, నిర్మాతలు కె. మురారి, ప్రతిభా శాస్త్రి, కోనై చెళియన్, రచయితలు ఆత్రేయ, పాలగుమ్మి పద్మరాజు ఇంకాఎందరెందరో .... పెద్దలతో .... అంతులేని ప్రజాసమూహంతో ....

సావిత్రి భౌతికకాయంవున్న ఆమె భర్త జెమినీగణేశన్ ఇంటి ప్రాంగణం అంతా కిటకిటలాడిపోయింది.

"సావిత్రి లాంటి నటి మళ్ళీ పుట్టలేదు—పుట్టదు" అన్నారు అక్కినేని...ఆ మాటలు అంటున్నపుడు అనుకోకుండా ఆయన కళ్ళవెంట అశ్రువులు రాలాయి.

"ఒకచరిత్రముగిసిపోయింది" అన్నారు దాసరి. దుఃఖసాగరంలో మునిగిపోయిన ఆయన మొఖాన్ని చూస్తుంటే సావిత్రి మరణం ఆయన్ను ఎంతటి ఆవేదనలో ముంచెత్తిందో అర్థంఅవుతోంది.

అక్కడకు వచ్చిన వారందరి హృదయాల్లోనూ ఒకటే బాధ—అందరి కళ్ళల్లోనూ ఒకటే ఆవేదన - అక్కడున్నవారందరూ ఆమె జ్ఞాపకాలను తలచుకొని విలపిస్తున్నవారే!


హృదయ విదారకమైన ఆదృశాన్ని చూసిన ఎవరైనా కంటతడిపెట్టకతప్పదు. కన్నీరు అంటేఏమిటో తెలియని ఎంతటి కఠిన హృదయుడైనా భోరున విలపించవలసిందే!

నభూతో నభవిష్యత్గా వెలిగిన ఈ నటీ శిరోమణికి అస్తమయంలేదు. ప్రజల హృదయాలలో పదిలమైన స్థానాన్నిపొందిన సావిత్రిగారిని మరచిపోవడం ఏ ఒక్కరికీ సాధ్యంకాదు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే చిరంజీవిని. ఈ మహానటి భౌతికకాయాన్ని అగ్నిహోత్రుడు ఆప్యాయంగా అందుకొన్నా, ఆవిడ స్మృతులు ప్రతిఅభిమాని జీవనాడిలో స్పందిస్తూనేవుంటాయి.

—విజయ్

* * *




'గోల్కొండ అబ్బులు
కృష్ణంరాజు
జయప్రద

# సెన్సార్ కబుర్లు

**1982** జనవరి 1 నుండి సెన్సార్ బోర్డువారు, చిత్రాలలో స్త్రీలను కించపరచే సన్నివేశాల్ని, మూఢ విశ్వాసాల్ని పూర్తిగా నిషేధించే వైఖరిని ఖచ్చితంగా అమలు జరుపుతుంది.

## A సర్టిఫికెట్ ఎలా వస్తుంది?

అసలు సెన్సార్ బోర్డువారు ఒకచిత్రాన్ని సెన్సార్ చేసేటప్పుడు ఏయే అంశాల్ని దృష్టిలోపెట్టుకుని సెన్సార్ చేస్తారన్న సందేహం చాలామంది పాఠకులకు కలుగుతుంది.

ప్రభుత్వం ఏర్పరచిన కొన్ని ముఖ్యసూత్రాలను (గైడ్‌లైన్స్), నిబంధనలను ఆధారంగా చేసుకుని సెన్సార్‌వారు చిత్రాన్ని సెన్సార్‌చేసి సర్టిఫికేట్ ను యిస్తారు. అయితే ఆ సర్టిఫికేట్ వెనుక కథ ఏమిటో సర్టిఫికేట్ వెనక్కి తిప్పితే కనబడదు. మరి ఎలా ? అనుకుంటే చదవండి !

### సెన్సార్ సూత్రాలు :

ప్రభుత్వం ప్రకటించిన "గెజిట్ నోటిఫికేషన్" లోది సినిమాటోగ్రాఫ్ – 1952 చట్టంలో, సబ్‌సెక్షన్ (2) సెక్షన్–5 బి లో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం చిత్రాల్ని ప్రదర్శనకు అంగీకరించడానికి "బోర్డు ఆఫ్ ఫిలిం సెన్సార్స్" వారికి ఈ క్రింది ముఖ్యసూత్రాలను ఆధారముగా యిచ్చారు!

ఫిలిం సెన్సార్‌షిప్ ముఖ్యోద్దేశ్యం ఏమిటంటే–

* సున్నితమైన సాంఘిక విలువలకు, సామాజిక ప్రమాణాలకు చిత్రం దోహదకారిగా వుండాలి.
* కళాత్మకమైన వివరణ, సృజనాత్మక శక్తిని అనవసరంగా అణగద్రొక్కకూడదు.
* సాంఘిక పరమైన మార్పులకు అనుగుణంగా సెన్సార్‌షిప్ వ్యవహరిస్తుంది.

పై వాటిని అనుసరించడంతో పాటు సెన్సార్‌బోర్డు ఈ క్రింది అంశాల్ని కూడా ముఖ్యంగా పరిశీలిస్తుంది :—

* సంఘ విద్రోహ చర్యలను, దౌర్జన్యకాండ–వీటిని వివరణతో న్యాయమైనవిగా చూపరాదు.
* నేరస్థుల కార్యకలాపాల్ని, లేక అందుకు సంబంధించిన దృశ్యాల్నిగాని, లేక యితరులచే నేరాన్ని చేయించడానికి ప్రేరణ కలిగించే సంభాషణలుగాని చిత్రీకరించరాదు.
* అర్థరహితమైనవి, దౌర్జన్యాన్ని చాటేవి, క్రూరత్వాన్ని, భీతినికలిగించేసన్నివేశాల్నిచూపించరాదు.
* మద్యపానం మంచిదన్న అభిప్రాయాన్నిగాని, లేక న్యాయమైనదన్న భావాన్ని కలిగించే సన్నివేశాల్నిగాని చూపించరాదు.
* అసభ్యత, అశ్లీలత, దుర్నీతి వీటిద్వారా మానవతా విలువల్ని కించపరచరాదు.
* జాతిపరమైన, మతపరమైన వాటిని ఆక్షేపించే సంభాషణలు లేక దృశ్యాలు వుండరాదు.

### బాలల చిత్రం పెద్దలు చూడొచ్చు

1982 సంవత్సరం వచ్చేసరికి పిల్లలకు వారు బతుకుతున్న సమాజ స్వరూపాన్ని స్వభావాన్ని వాళ్ళకు అర్థమయ్యేలా సులభశైలిలో స్పష్టమైన పద్ధతిలో విశదీకరించే చిత్రాల కొరకు ఆంధ్ర ప్రజ ఎదురు చూసింది.

ఇప్పుడు మళ్ళీ ముఖ్య సత్రాలలో బాలల చలన చిత్రోత్సవాలు జరుగు తున్నాయి. ఆర్థిక సహాయం చేస్తామన్న నిర్మాతలు

### మూడు అంకెల తార

నా లక్కీ నెంబరు ఒకటి కాదు, మూడున్నాయి. అవి 3, 6, 9. మూడు నెంబర్లు ఎందుకొచ్చాయంటే–నా పుట్టిన తేదీ 3. ఏ లక్ స్టార్టయినా పుట్టిన తేదీ నుంచేగదా ప్రారంభం అయ్యేది. నా డేట్ ఆఫ్ బర్త్ 3 గనుక. దానికి రెలెటివ్‌గా వుండే నెంబర్లు 6, 9. ఈ మూడూ నాకు లక్‌నియిచ్చే నెంబర్లుగా భావిస్తాను" అంటుంది జయప్రద.

చవితిరోజున ఏ పని చేయడానికయినా మనం వెనకాడతాం. ఆరోజున ఇవ్వడం, పుచ్చుకోడం, కొనడంలాంటివి చేయకూడదని అంటూంటారు. కాని చవితి రోజుపై భిన్నాభిప్రాయం కలిగిన జయప్రద ఏమంటుందో ఆమె మాటల్లో వినండి–

"ఎప్పుడైనా నేను జ్యూయలరీ షాపుకి వెళ్ళి నగలో, బంగారమో కొందామని వెళ్ళినరోజు, కొన్నరోజు తప్పకుండా చవితిరోజై తీరుతుంది. అదేమిటో తెలీదుగాని, ఖచ్చితంగా ఆరోజు చవితి వస్తుంది. షాపునుంచి తిరిగి వచ్చాక ఎవరో చెబుతారు 'ఈరోజు చవితి' అని. అందుచే చవితికూడా నా లక్కీ నెంబరే.... సారీ, లక్కీ తిథి"



* దేశ సమైక్యత, సంఘటిత శక్తిని చర్చనీయాంశంగా తీసుకురాకూడదు.
* రాష్ట్రభద్రతకు చిత్రం హాని కలిగించే విధంగా వుండరాదు.
* పొరుగు దేశాలతో మైత్రీ సంబంధాలకు భంగంకలుగనీయకూడదు.
* ప్రజల జీవన విధానం అపాయానికి లోనుకాకూడదు.
* సన్నివేశాల చిత్రీకరణ, సంభాషణలు కోర్టు విధానాలను కించపరచే విధంగా వుండరాదు.
* ఓహో ఇవేనా అనుకుంటే ఇంకా ఉన్నాయి.
* చిత్రంయొక్క పూర్తి ప్రభావాన్నిబట్టి తగిన నిర్ణయాన్ని ప్రకటించవచ్చు.
* దేశంలోని ప్రజల సమకాలీన పరిస్థితులను, విధానాన్నిబట్టి చిత్రాలు పరిశీలించబడతాయి.

పై లక్షణాలతోకూడిన చిత్రం అన్ని వయస్సులవారికి చూపించడం సబబుకాదని నిర్ణయం తీసుకున్నప్పుడు ఆ చిత్రానికి "పెద్దలకు మాత్రమే" అన్న సర్టిఫికేట్‌ని యివ్వడానికి నిర్ణయిస్తారు!!

“ఫిలిం సెన్సార్‌షిప్ సమకాలీన సాంఘిక ఆచారాలకు వైరుధ్యంగా భాసిల్లే ఒక దర్పణం వంటిది. ఇక్కడ చూపించవలసినది చూపించరు. చూడకూడనిది బహు చక్కగా చూపిస్తారు” అంటారు అమెరికన్ విమర్శకులు సుసన్ సోన్‌టాగ్.



ముందుకు ఎందుకు రావడం లేదు? తమిళ రాష్ట్ర ప్రభుత్వం కూడా సబ్సిడీ యిస్తానని ప్రకటించింది—తమిళ నిర్మాతలు ముందుకు వస్తారేమో చూద్దాం!

'పెద్దలకు మాత్రమే'అంటూ 'ఎ' సర్టిఫికెట్ తీసుకున్నట్టే—బాలల చిత్రాలు కూడా తీసి, పెద్దలు కూడా ఈ చిత్రాలు చూడవచ్చు అంటూ సర్టిఫికేట్ తీసుకుంటే? ఏది ఏమైనా బాలల చిత్రాల కోసం ఎదురు చూద్దాం. మనకు బాల నటుల కొరత లేదుకదా?!




* స్త్రీ పురుషుడితో ఉండే సన్నివేశంలో ఆమె 'బ్రెస్ట్' క్లీవేజ్ క్లోజప్‌లో చూపించకూడదు

## కత్తెర బొమ్మలు

## మూడు రకాల చిత్రాలు

మనదేశంలో మొత్తం మూడు రకాల చిత్రాలు మాత్రం వున్నాయి!" అన్నాడు తాతయ్య. ఎక్కాలు చదువుతున్న మనవడు "పోదూ బడాయి. మా స్కూల్ ప్రక్కనే వరసగా ఎనిమిది సిన్మా హాళ్లల్లో ఎనిమిది రకాల సిన్మాలాడుతున్నాయ్" అన్నాడు తాతయ్యను ఫూల్ కింద జమకట్టి. "అలా కాదురా భడవా! మన ప్రభుత్వం చిత్రాల్ని మూడు విధాలుగా విభజించింది.



అవి మద్రాసు చిత్రం. కలకత్తా చిత్రం. బొంబాయి చిత్రం. అంటే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్నాటక, లక్షద్వీప్ తదితర ప్రాంతాల్లో నిర్మించబడ్డ చిత్రాల్ని మద్రాసు చిత్రం అంటారు.

అలాగే వెస్టు బెంగాల్, బీహార్, ఒరిస్సా, అస్సాం, మణిపూర్, మేఘాలయా వంటి ఈస్టర్న్ స్టేట్స్‌లో తయారయ్యే చిత్రాలను కలకత్తాచిత్రాలంటారు.

ఇక తక్కిన ప్రాంతాల్లో నిర్మించబడ్డ చిత్రాల్ని బొంబాయి చిత్రాలంటారు. అర్థంఅయిందా" అంటూ ఓ నశ్యం పట్టుబిగించాడు


నారాయణ్రావ్

* * *

ఇంటర్వ్యూ



# వివాహానికి నటజీవితానికి సంబంధం లేదు?



కానీ కుమారి జయసుధ, శ్రీమతి జయసుధ అయినా ఆమె నటించిన చిత్రాలు అదేవిధంగా విజయం చవిచూస్తున్నాయి. వివాహానికి నటజీవితానికీ ఎటువంటి సంబంధంలేదని-ఉత్తమ నటనను ఎప్పుడైనా ప్రేక్షకులు ఆదరిస్తారని ఋజువుచేసింది.

అది ఎ.వి.ఎమ్. 6 వ ఫ్లోర్. బయట దాదాపు ఓ నలభయిమంది వరకూ గుంపుగా ఉన్నారు.

మధ్యలో వాళ్ళు అడుగుతున్న ప్రశ్నలన్నింటికీ సమాధానాలు ఇస్తూ కనిపించింది శ్రీమతి జయసుధ.

వివాహం అయినాకూడా తగ్గని ఆ గ్లామర్, ఆ ఇమేజ్ ఆమె ఎంతటి ప్రతిభావంతమైన నటో తెలియ జేస్తాయి. కొందరు హీరోయిన్లు హీరోపక్కన ఓ అలంకారంగానే పరిమితం అయిపోతారు. కానీ జయసుధ అలాకాదు. లక్ష్మణరేఖ, జ్యోతి, ఆమెకథ, మల్లెపూవు, ప్రేమలేఖలు, ఇది కథకాదు, శివరంజని, ఇల్లాలు ఇలా ఎన్నో చిత్రాల్లో ఉత్తమ పాత్రలు పోషించి అత్యుత్తమ నటిగా అందరి అభిమానాన్ని అందుకుంది.

> "వివాహం అయిన తర్వాత ఏ నటికి అయినా గ్లామర్-ఇమేజ్ తగ్గిపోతాయన్న ఓ అభిప్రాయం ఉంది."



జయసుధ నటన కోసమే కేవలం చిత్రంచూసే ప్రేక్షకులున్నారంటే అతిశయోక్తి కాదు.

## మలేషియా అభిమానులు

విషయం ఏమిటో తెలుసుకుందామని

"వీళ్ళంతామీ అభిమానులా?" అని అడిగాను.

"అవునండీ" అంది నవ్వుతూ జయసుధ. వచ్చినవారంతా ఏఊరివాళ్ళయి ఉంటారు అని ఆలోచిస్తుండగా—

"మేముమలేషియాలో సెటిల్ అయిన ఆంధ్రులం" అని ఆ బృందంలోని వ్యక్తి తెలియపర్చారు.

ప్రశ్నల వర్షాన్ని ముగించిన తర్వాత ఫొటో దిగాలన్న కోరికను వ్యక్తం చేసింది ఆ బృందం.

జయసుధ "నేను రెడీ" అనే సరికి అదే ఛాన్స్ అనుకొని ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు ఫొటోలు తీయడం ప్రారంభించారు.

ఫొటోల కార్యక్రమం పూర్తవడంతో ఆ బృందం జయసుధకు థాంక్స్ చెపుతూ అక్కడ నుండి బయలుదేరింది.

షాట్ యింకా రెడి కానందువలన ఫ్లోర్ బయట కుర్చీలు వేయించి జయసుధ కూర్చోవడంతో, నేను ఇంటర్వ్యూ ప్రారంభించాను.

## 200 అభిమాన సంఘాలు

"మీకు ప్రతిరోజు అభిమానులు కలుస్తుంటారా?" అని అడిగితే—

"ప్రతిరోజు ఏదో ఒక ఊరినుంచి వస్తూనే ఉంటారు-కలుస్తుంటారు. నేను నటించిన చిత్రాలమీద వారి అభిప్రాయాలను తెలియపరుస్తూ ఉంటారు. నా నట జీవితంపై ఎంతో శ్రద్ధ తీసుకుంటూ ప్రతి చిన్న విషయాన్ని నాకు తెలియపరుస్తూ, నేను నటించే అన్ని చిత్రాలు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకునే అభిమానులతో మాట్లాడుతున్నంతసేపు నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది. ప్రస్తుతం నాకు రెండువందల పదిహేడు అభిమాన సంఘాలు ఉన్నాయి. వాటిల్లో ఎక్కువగా మహిళలు నిర్వహించేవి ఉండటం ఒక విశేషం-అంటూ అభిమానుల గురించి, అభిమాన సంఘాలను గురించి తెలియపర్చారు.

యిక అభిమానులు వ్రాసే ఉత్తరాలు గురించి చెప్పాలంటే ఎంత టైమ్ అయినా సరిపోదు. తెలుగు, తమిళ్, ఇంగ్లీషు భాషలలో అభిమానులు వ్రాసే ఉత్తరాలు చదువుతుంటే నామీద వారికున్న అభిమానానికి ఏ విధంగా కృతజ్ఞతలు తెలుపుకోవాలో అర్థం కాదు. అందుకే వీలయినంతవరకు ప్రతి ఉత్తరానికి సమాధానాలు

వ్రాయిస్తూ ఉంటాను." అని చెప్పారు.

## పెళ్ళయినా ప్రేమలేఖలే...!

"ఆ మధ్య మీకు లవ్ లెటర్స్ చాలా వచ్చేవి కదా? వివాహం అయిన తర్వాత లవ్ లెటర్స్ రావడంలేదా?" అన్న నా ప్రశ్నకు సమాధానంగా—

"వివాహం అయిన తర్వాత యిదివరకు వచ్చినన్ని లవ్ లెటర్స్ రావడంలేదు కానీ యిప్పటికీ ప్రతి రోజు లవ్ లెటర్స్ వస్తూనే ఉన్నాయి. వాటిని చదువుతుంటే ఎంతో నవ్వు వస్తుంటుంది. నాకు వివాహం అయిన సంగతి తెలియని వారు యింకా లవ్ లెటర్స్ వ్రాస్తున్నారని నేను అభిప్రాయ పడుతున్నాను" అని అన్నారు.

## నటిగా గృహిణిగా ద్విపాత్రాభినయం

మీరు వివాహంఅయినతర్వాత నటిగా, గృహిణిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు కదా—యిందువలన మీరు ఏమయినా ఇబ్బందులు ఎదుర్కొన్నారా?" అని అడిగినపుడు—

వివాహం కాకముందు నా దృష్టి అంతా నా నటజీవితం మీదే ఉండేది. కానీ యిప్పుడు కుటుంబ వ్యవహారాలు కూడా చూసుకోవాలి కనుక యిదివరకు లాగా అదేపనిగా ఎప్పుడూ షూటింగ్స్‌లో పాల్గొనడానికి వీలు పడటంలేదు. వివాహం అయ్యాక కొంత సమయాన్ని కుటుంబ విషయాల కోసం కేటాయించవలసివస్తుంది. అంతేకాకుండా చాలా బాధ్యతలు పెరిగాయి. అది సహజమే కదా?" అంటూ రిలాక్స్ అయ్యారు.

## ఇతర భాషా చిత్రాల్లో నటించను

"తెలుగు చిత్రాలు కాకుండా యితర భాషా చిత్రాలు ఏవైనా అంగీకరించారా?" అని అడిగితే

ప్రస్తుతం తాను జయసుధ, మేఘ సందేశం, మధురస్వప్నం, కోరుకున్న మొగుడు, డాక్టర్ సినీయాక్టర్, ఎవరు వీరు ఎవరు వీరు, నిప్పుతో చెలగాటం, గృహప్రవేశం, రాగదీపం, సీతాలు, భలేకాపురం మొదలగు చిత్రాలలో నటిస్తున్నానని జ్యోతి ఆర్ట్ క్రియేషన్, కోటగిరి ఫిలింస్ చిత్రాలు అంగీకరించానని మరో అయిదు చిత్రాలకు కాల్‌షీట్స్ యివ్వాలని — తెలుగు చిత్రాలతో యింత బిజీగా ఉన్నతనకు తమిళ చిత్రాలలో అవకాశాలు వస్తున్నా అంగీకరించడం లేదని గతంలో కొన్ని తమిళ, మళయాలం





చిత్రాలలో నటించి నప్పటికీ ఇప్పుడు మాత్రం యితర భాషా చిత్రాలలో నటించడానికి అంగీకరించదలుచుకోవడం లేదని" తెలియచేసారు.

## మార్కెట్ బట్టి నటిస్తాను

"చాలా చిత్రాలలో నటిస్తున్నారు. నటిగా మీరు ఎన్ని పూర్తిచేయాలనుకున్నారు?"

"అటువంటి నిర్ణయాలు నేను ఏమీ తీసుకోలేదు. ఇక ముందు కూడా తీసుకోను. నటిగా నాకు మార్కెట్ బాగా ఉన్నంతకాలం నటిస్తాను. మార్కెట్ పడిపోకముందే పరిశ్రమనుండి విరమిస్తాను. నేను ఎన్ని చిత్రాలలో నటించాలన్న నిర్ణయం నేను తీసుకున్నంత మాత్రాన నటించటం ఎలా సాధ్యం అవుతుంది, నన్ను ప్రజలు ఎన్ని చిత్రాలలో ఆదరించాలనుకుంటారో అన్ని చిత్రాలలోనే నేను నటిస్తాను. అని తన నటజీవితం అంతా ప్రేక్షకుల ఆదరణపైనేగానీ, తన నిర్ణయాలమీద ఆధారపడిలేదన్న" అభిప్రాయాన్ని వ్యక్తంచేసి తన నిరాడంబరత్వాన్ని ఆమె తెలియచేశారు.

"యిన్నాళ్ళూ అందరి హీరోలతో నటించినా కృష్ణగారి సరసన ఏ చిత్రంలోను నటించలేదు— కానీ యిప్పుడు "డాక్టర్—సినీ యాక్టర్"లో కలిసి నటించడంలో విశేషం ఏమైనా ఉందా? అంటూ వస్తున్న పాఠకుల ఉత్తరాలకు మీరిచ్చే సమాధానం ఏమిటని అడిగితే—





"ఇన్నాళ్ళూ అవకాశాలు రాక కలిసి నటించలేదు- యిప్పుడు అవకాశం వచ్చింది నటిస్తున్నాను. అదే విశేషం" అన్నారు నవ్వుతూ.

## దర్శకత్వం చెయ్యను

"ఏ పాత్రనయినా క్షుణ్ణంగా అర్థంచేసుకొని అపూర్వంగా నటిస్తూ ఎన్నో చిత్ర విజయాలకు కారకులయిన మీరే దర్శకత్వం వహిస్తే మరిన్ని మంచి చిత్రాలు వస్తాయి అని కొందరి అభిప్రాయం. మీరేమంటారు?" అని అడుగగా—

సరదాగా ఎప్పుడైనా నేను దర్శకత్వం చేస్తున్నట్లుగా ఎవరితోనయినా అంటే అని ఉండవచ్చు కానీ- నాకు మాత్రం దర్శకత్వం వహించాలని, చిత్రాలు నిర్మించాలన్న ఆలోచన లేనేలేదు" అని ఖచ్చితంగా చెప్పారు.

"ఈ మధ్య కొత్తగా పరిశ్రమలోకి వస్తున్న కొత్త హీరోయిన్లకు మీరిచ్చే సందేశం ఏమిటి?" అని అడిగినపుడు—

"ఎవరయినా "సరే కేవలం గ్లామర్ పాత్రలకే అంకితం కాకుండా, వీలయినంతవరకు నటించడానికి అవకాశాన్ని కల్గించి తమ నటనా సామర్థ్యాన్ని ప్రదర్శించగలిగే పాత్రలను కూడా పోషించి ప్రేక్షకుల అభిమానాన్ని పొందటానికి కృషి చేయవలసిందిగా కోరుతున్నానని యింతకు మించిన సందేశం ఏమీలేదని" తెలియపర్చారు.

యింతలో షాట్ రెడీ అవటంతో ఆవిడ సెట్‌లోకి వెళ్ళారు.

తను—తన పాత్రలు—తన కుటుంబం వీటి గురించేతప్ప మిగతా విషయాలను ఎక్కువగా ఆలోచించని "జయసుధ" ధరి

స్తున్న పాత్రలన్నీ ప్రేక్షకుల ఆదరణ పొందుతాయని ఆశిద్దాం.

—విజయ్



# జవాబులు ✿ జవాబులు

## జయప్రద



చిత్రాన్ని ఒప్పుకునే ముందు మీరు దేనికి ప్రాధాన్యతనిస్తారు? కథకా? దర్శకునికా? బేనర్ కా?

—ఆర్. సువర్చల (తిరుపతి)

కథకే!

పెళ్ళయిన తర్వాత సినిమాల్లో నటిస్తారా?

—ఎల్. నారాయణ (చేబ్రోలు)

పెళ్ళయిన తర్వాత చెబుతాను.

మీ జీవితాశయం ఏమిటి?

—టి. రాధాకృష్ణ (ఆదోని)

ఇంతకంటే పైకి వెళ్ళాలని. గోల్ రీచ్ కావాలని.

మీకు పట్టుచీరలంటే ఇష్టమని నేను, ఆర్గండీ చీరలు యిష్టమని నా స్నేహితురాలు పోటీ పెట్టుకున్నాం. మా యిద్దరిలో గెలుపు ఎవరిదంటారు?

—కోన సుబ్బలక్ష్మి (ఏలూరు)

పట్టు చీరలు కట్టుకుంటాను. నాకు ఆర్గండీ చీరలంటేనే యిష్టం!!

నాట్య కళాశాలను స్థాపించే ఉద్దేశ్యం ఉన్నదా?

—వై. అనూరాధ (ఆత్మకూరు)

ఇప్పట్లో లేదు. భవిష్యత్తులో కలగవచ్చేమో!

మీకు కాబోయే భర్త మీద మీకెటువంటి ఆశలున్నాయి.

—ఎ. అనూరాధ (హైదరాబాదు)

నా మనస్సును అర్థం చేసుకోగలవాడై వుండాలి.

✿

## శోభన్‌బాబు



మీరు నటించిన చిత్రాలు మీరు చూస్తున్నప్పుడు మీకెలాంటి అనుభూతి కలుగుతుంది?

—కె. శ్రీహరిరావు (ఉప్పాడ)

"మనమే చేశామా!" అని ఒకోసారి, "మనమే చేశామా?" అని యింకోసారి అనిపిస్తుంది.

నటించిన చిత్రాల జయాపజయాలు వ్యక్తిగత జీవితంపై ప్రభావం చూపిస్తాయంటారా?

—సి. ఆనందజ్యోతి (తిరుపతి)

తప్పకుండా! చిత్రం విజయవంతం అయితే పూదండలా కాకపోతే పేడ ముద్దల్లా.

అంతమంది హీరోయిన్స్‌తో కలిసి గెంతులేస్తారు? మీ ఆవిడ ఏమీ అనరాండీ?

—ఎస్. [illegible] (విజయవాడ)

ఇంట్లో కూడా గంతులేస్తూనే వుంటాను కోపంలో! ఒక రకంగా తాపంలో యింకో రకంగా!!

హిందీ చిత్రరంగం గురించి మీ అభిప్రాయం ఏమిటి? హిందీ చిత్రాలలో నటించాలని మీకు లేదా?

—టి. కల్యాణీరావు (నిడదవోలు)

మనసుకి మానవత్వానికి విలువలేని చోటుకెళ్ళమంటారా? అవకాశం వచ్చినా అక్కడ యిమడలేను.

మీకు మొదట అమ్మాయి పుట్టిందని నేను, కాదు అబ్బాయే పుట్టాడని నా ఫ్రెండ్ పందెం వేసుకున్నాం! మీరెవరితో ఏకీభవిస్తారు సార్?

—కళింగ అప్పారావు (వరంగల్)

ముందు మీ ఫ్రెండ్‌తో తర్వాత మీతో!!

✿

## కృష్ణ



చలనచిత్ర నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మీరు పరిశ్రమను హైదరాబాదుకు తరలించడంలో ముఖ్య పాత్రను వహించవచ్చు కదా?

—ఎమ్.వి. ఆర్. (హైదరాబాదు)

ఇప్పుడు నేను కొత్తగా ముఖ్య పాత్ర వహించవలసింది ఏమీ లేదు. మా సోదరులు రామారావు గారు, నాగేశ్వరరావుగారు ఆ పని చేశారు.

అభిమాన సంఘాలు నటులకు ఇమేజ్ పెంచుకోవడానికి దోహదం చేస్తాయంటారా?

—ఎం. సంజీవరెడ్డి (ఒంగోలు)

కొంతవరకు.... అభిమానులకు నా విజ్ఞప్తి ఏమిటంటే డెబ్బయి రోజులు ఆడే చిత్రాన్ని వందరోజుల వరకు ఆడించమని అడగడం అలా అడిగి ఆ చిత్రాన్ని డ్రాగ్ చెయ్యడానికి ప్రయత్నించడం మానండని. అలా డ్రాగ్ చేసినందువల్ల ఆ చిత్రంలోని నటుడికి ఇమేజ్ మరింత పెరుగుతుందని అనుకోవడం పొరపాటు. సినిమా ఎన్ని రోజులు ఆడిందనే కంటే నిర్మాతకు ఎంత షేర్ వచ్చిందనేదే ముఖ్యం. అభిమాన సంఘాల వారు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవడం మంచిదని నా అభిప్రాయం.

మీ శ్రీమతి దర్శకత్వంలో మీరు నటిస్తున్నప్పుడు మీకు ఎటువంటి అనుభూతి కలుగుతుంది?

—సి. హెచ్. అన్నపూర్ణ (విశాఖపట్నం)

ఏ డైరెక్టర్‌తో వర్క్ చేసినా, నాకు ఒకే అనుభూతి కలుగుతుంది.

## శ్రీదేవి

వివాహం చేసుకొనే ఉద్దేశ్యం ఉన్నదా? ఉంటే ఎలాంటివారు మీకు భర్తగా కావాలని కోరుకుంటున్నారు?

—వై. సుందరి (ఏలూరు)

పెళ్ళి చేసుకోవాలనే ఉద్దేశ్యం తప్పకుండా ఉన్నది. పోతే యిలాంటి ఆశయాలు గల వ్యక్తి కావాలని వేనసడం లేదు. ఎందుకంటే అను కున్నది అనుకున్నట్లుగా జరగదు కదా! పైన భగవంతుడున్నాడు. ఆతని ఇష్ట ప్రకారమే అన్నీ జరుగుతాయి.

మీ అభిమాన హిందీ హీరో ఎవరు?

—టి. కనకరాజు (ఆమదాలవలస)

ధర్మేంద్ర

మీకు వెస్టర్న్ డాన్స్ అంటే ఇష్టమా? లేక మన సాంప్రదాయానికి తగ్గ నృత్యంఅంటే ఇష్టమా?

—అంకె అనూరాధ (తణుకు)

రెండూ ఇష్టమే!!

మీ చెల్లెలు శ్రీలతను కూడా సినిమాతారను చెయ్యాలన్న సంకల్పం వున్నదా?

—ఎ. హనుమంతరావు (పెద్దాపురం)

ఆ ఉద్దేశ్యం నాకుగాని నా చెల్లెలుకు గాని లేదు.



# పాఠకుల ప్రశ్నలకు తారల జవాబులు



చిత్రంలో మొట్టమొదటిసారిగా" కథా
నాయికగా నటించింది. అంతే.
అక్కడితో చదువుకి బ్రేకుపడిపోయి

యీమధ్య తెలుగువారి హిందీ చిత్రాల
నాయకుడు జితేంద్ర మాట్లాడుతూ—
"కాలేజీ రోజుల్లో సినిమాకి వెళ్ళడం అం
ఎంతో థ్రిల్‌గా వుండేది. కాలేజీ ఎగ్గొ

# తారలతీరు సెట్స్‌పైనా బయటా!

**35** తెలుగు చిత్రాలలో నటించి అందర్నీ ఆకర్షించిన అందాల నటి భారతిని ఇప్పుడు కర్నాటక హేండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అప్పాయింట్ చేశారు కర్నాటక ముఖ్యమంత్రి శ్రీ గుండూరావు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టినప్పటి నుంచీ యిటువంటి ఆశ్చర్యకరమైన పత్రికా ప్రకటనలు చేయడం. స్పాట్ డెసిషన్స్ తీసుకోవడం ఆయనకి కొత్తకాదు.

## ప్రభుత్వ ఉద్యోగిగా భారతి

కానీ పేపర్‌లలో తన అప్పాయింట్‌మెంటు గురించి చదువుకొన్నప్పుడు భారతికి కొత్తగాను, ఆశ్చర్యంగాను అనిపించింది. ఎందుకంటే పేపర్‌లో చూసేవరకూ తనకా విషయం తెలీదు. గుండూరావుగార్ని ఆమె అంతకు ముందు కలిసింది లేదు. ఏవో ఒకటి రెండు ఫంక్షన్స్‌లోతప్ప.

"మీ కొత్త ఉద్యోగం ఎలా వుంది?"

"ఇది చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంది. కాని, ఈ హేండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంటు గురించి యింకా నేను క్షుణ్ణంగా తెలుసుకోవలసి వుంది. ఇప్పుడప్పుడే దీని గురించి నేనేమీ చెప్పే స్థితిలో లేను. త్వరలోనే ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి అన్ని వివరాలు అప్పుడు చెబుతాను" అన్నారామె.

1950లో జన్మించిన భారతి. 16వ ఏట బెంగుళూర్ మహారాణి కాలేజీలో పి.యు.సి. చదువుతున్నప్పుడు 'లవ్ ఇన్ బెంగుళూర్'

ఆ తర్వాత 50 కన్నడం; 35 తెలుగు, 30 తమిళం, 1 మళయాలం, 11 హిందీ చిత్రాలలోను నటించింది.

12 ఏళ్ళలో ఏక కాలంలో ఇన్ని భాషా చిత్రాలలో నటించడం ఒక నటికి ఇదే మొదటి సారేమో!

1974లో ప్రసాద్ ప్రొడక్షన్స్‌వారి కన్నడ చిత్రం 'మనె బెలిగిడసొసె'లో నటిస్తున్నపుడు ఆ చిత్ర కథానాయకుడు విష్ణువర్ధన్‌తో పరిచయమై. ఆ పరిచయం ప్రేమగా మారి, ఆయన్ని 1975 ఫిబ్రవరి 27న వివాహం చేసుకుంది.

## వీడియో దెబ్బ!

పెద్దపెద్ద నగరాల్లో వీడియోల ప్రభావం అధికమై.సినిమాల కలెక్షన్స్ పడిపోతున్నాయి. మాస్ కలెక్షన్స్ మామూలుగానే వున్నా క్లాస్ కలెక్షన్ తగ్గిపోతున్నమాట వాస్తవం.

బిగ్ సిటీస్‌లో, బిగ్ ఫామిలీస్‌లో ఇంటికి ఒకటి కాకపోయినా, పది యిళ్ళకొక వీడియో వచ్చేసింది కాబట్టి, యీ తొమ్మిదిళ్ళవారు పదో యింట్లో చేరి, నగరంలో ప్రదర్శింపబడుతున్న కొత్త సినిమాలని వీడియోలో చూసేస్తున్నారు. ఎంత లేదనుకున్నా యింటికి ఏవరేజిన అయిదుగుర్ని వేసుకున్నా పదిళ్ళకు 50 టికెట్లుపోతున్నా యన్నమాట!


ఈ విషయంమీద

సినిమా చూడడం, ఇంటర్వెల్‌లో సిగరెట్లుకాల్చుకోవడం, మధ్యలో అల్లరి చేయడం ఎంతో సరదాగా వుండేది. వీడియో వచ్చాయిప్పుడుసినిమాలను దెబ్బతీస్తోంది" అన్నారు.

## బాలచందర్ శాండ్‌విచ్

'ముద్దమందారం' శతదినోత్సవ వేడుకలు మద్రాస్ పామ్‌గ్రోవ్ హోటల్లో జరిగాయి.







ఈ ఉత్సవ సభకు కె. బాలచందర్ అధ్యక్షత వహించారు. దాసరి నారాయణరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముఖ్య అతిథుల లిస్టులో కె. విశ్వనాథ్ పేరు కూడా వుంది. కానీ, ఆయన విశాఖపట్నంలో షూటింగులో వుండి పోయి, వీలుకాక రాలేకపోయారట!

దర్శకుడు శ్రీ బాలచందర్ దాసరి, కె. విశ్వనాథ్‌లగురించి మాట్లాడుతూ—

"ఒకరు ప్రపంచమంతా ప్రదర్శింపబడే చిత్రాలు తీసేవారయితే, మరొకరు మూడు వందలు, ఐదు వందలరోజులు ప్రదర్శింపబడే చిత్రాలుతీసేవారనీ, అటువంటి వారిమధ్య వేసి జంధ్యాల తనను 'శాండ్ విచ్' చేశారని చమత్కరించారు.

అందుకు శ్రీ దాసరి తమ ప్రసంగంలో సమాధానం చెబుతూ, 'శాండ్ విచ్'కి అటూ, ఇటూ రొట్టె ముక్క లుంటాయి. ఆ రొట్టెముక్కల మధ్య వుండే 'శాండ్ విచ్'కి ప్రత్యేక ఎట్రాక్షన్ వుంటుంది అన్నారు.

ముద్దమందారం చిత్ర విజయాన్ని గురించి ప్రస్తావిస్తూ,

"ఈ చిత్రానికి తారాబలంలేదు. కేవలం సాంకేతిక బలంతోనే విజయాన్ని సాధించింది. ఆ క్రెడిట్ జంధ్యాలగారిది అంతా కొత్తవారితో. ఒక చిన్న థీమ్‌ని, రసస్ఫోరకంగా చిత్రించి జనరంజకంచేసి యివాళ ఆ చిత్రం నూరురోజులు నడవడానికిగల పూర్తి క్రెడిట్ శ్రీ జంధ్యాలకు దక్కుతుంది. ఇటువంటి చిత్రం తీయడానికి ఆయన్ని ప్రోత్సహించిన నిర్మాత శ్రీ కోనేరు రవీంద్రనాథ్‌గార్ని ముఖ్యంగా నేను అభినందిస్తున్నాను. అంతా కొత్త వారితో, కొత్తరకం సబ్జెక్ట్సతో, నేనూ అనేక సార్లు అనుకుని, నా నిర్మాతలతో యిలా కొత్త వారితోతీద్దాం, నా రెమ్యూనరేషన్‌లో సగం తగ్గించుకుంటానని చెప్పినా, వారు తమకు తారాబలం కావాలంటున్న కారణంచేత తాను అటువంటి చిత్రాలు తీయలేకపోతున్నానని" చెప్పారు దాసరి.

## భయ స్కోప్

వేదికపైకి అందర్నీ ఆహ్వానించి నాటి సభా కార్యక్రమాల్ని అందంగా నడిపారు, ప్రముఖ నేపథ్య గాయకుడు శ్రీ యస్. పి. బాలసుబ్రహ్మణ్యం.

షీల్డుల కార్యక్రమానంతరం కాకినాడ మెడికోస్ 'భయస్కోప్' అనే మ్యూజికల్ మైమ్‌ను ప్రదర్శించారు.

ఈ ప్రదర్శనకు ముందుగా ప్రవేశద్వారం దగ్గర దీనికి సంబంధించిన ప్రకటన పెట్టారు. ఆ ప్రకటన చివరన యు విల్ లాఫ్ టిల్ యువర్ పాంట్స్ ఆఫ్ అని రాశారు.

ఇది సరదాకి రాసిందే అయినా, కొందరు 'టూమచ్' అని చిరాకుపడితే, జంధ్యాల తండ్రి గారు మాత్రం "ఇదేదో టూ మచ్‌గా వుందే" అంటూ నవ్వారు. ఆ నవ్వులో రాసిన వారి భావాన్ని స్ఫురింపచేస్తూ.

అఫ్‌కోర్స్, ఆ నాటిక ప్రదర్శనానంతరం ఎంతమంది పాంట్స్ ఊడిపోయాయో మేము చూడలేదనుకోండి!

## లక్ష్మి రేసులు

"ఓసారి రేసులకి వెళ్ళాను!" అన్నారు లక్ష్మి.

"మీరు రేసులకి వెళ్తారా?" ఆశ్చర్యంతో అడిగాము.

"తరచూ వెళ్ళను. ఒక్కసారే వెళ్ళాను. అదైనా-అంతా 'లక్, లక్' అంటుంటారే,



"లక్ మాట దేవుడెరుగు, అన్యాయంగా వచ్చిన డబ్బుతో ముందు అశాంతి ప్రారంభం అవుతుంది"

## నవరసనాయికి సరిత

మనకున్న మంచి నటీమణులలో సరిత ఒకరు. ఈ తెలుగమ్మాయిని తెలుగువారికన్నా తమిళులే మంచి వేషాలిచ్చి చక్కగా ఉపయోగించుకొంటున్నారేమోననే భావన కలుగుతుంది

తెలుగు తమిళ భాషల్లోనేకాక, కన్నడ చిత్రాల్లోకూడా నటిస్తూ, రాణిస్తున్నది సరిత. ఇటీవల ఆమె రాజ్‌కుమార్‌తో నటించిన 'కెరళిదసింహ' కర్నాటక రాష్ట్రమంతటా ఎంతో విజయవంతంగా నడుస్తున్నది.

"ఈమధ్య నాకు 'తణ్ణీర్, తణ్ణీర్' షూటింగ్ జరిగిన ప్రాంతాలు కోవిల్‌పట్టి, రాజపాళయం లలో సన్మానంచేసి రెండు బిరుదులు యిచ్చారు కోవిల్‌పట్టిలో 'నడిప్పు పేరొళి', రాజపాళయంలో నవరస నాయికి అని యిచ్చారు అన్నదామె యిటీవల కలిసినపుడు.

వెనక శ్రీమతి పద్మినికి 'నాట్య పేరొళి' అనే బిరుదు లభించింది.

తెలుగులో కె. సి. ఫిలిమ్స్ వారి "చందమామ", విజయామాధవీ సినీ ఎంటర్‌ప్రైజెస్ వారి తొలి వర్ణచిత్రం ఆమెవి త్వరలో విడుదల కానున్న చిత్రాలు.


— మోహన్‌కుమార్ * * *

నా లక్ ఎలావుందో చూసుకుందామని వెళ్ళాను"

"గుడ్‌లక్కా, బేడ్‌లక్కా?"

"ఆ రోజు నా లక్ బ్రహ్మాండంగా వుంది. అపుడు బెంగుళూర్‌లో కన్నడ చిత్రంషూటింగ్ కోసం వెళ్ళాను. మా ఫామిలీ ఫ్రెండ్స్‌తో కలిసి రేసులకువెళ్ళాను. ఒక గుర్రంమీద ఐదు రూపాయలు పందెంకట్టాను. ఆ గుర్రం అన్ని గుర్రాలనూదాటి ముందుకొచ్చేస్తుంటే - ఎంత ఎగ్జయిటింగ్‌గా ఫీలయ్యానో యిపుడు చెప్పలేను.

"నా ఐదు రూపాయలకి ఐదు వందలు వచ్చాయి. గెలిచినపుడు ఎంత ఆనందం అనుభవించానో, ఆ ఐదు వందలూ చేతికి వచ్చాక అంత ఆందోళన ప్రారంభం అయింది నాలో. ఇది న్యాయంగా సంపాయించిన డబ్బుకాదు ... చివరికో నిర్ణయానికి వచ్చాను. ఈ డబ్బు పేదసాదలకు పంచిపెట్టాలని.... అదే చేశాను" అన్నారు లక్ష్మి.





## కోరుకోకుండానే తారనయ్యాను

**-రాధిక**

నేనో పెద్ద నటినవ్వాలని ఏనాడూ కలలు కనలేదు. అసలా ఆశ, కోరిక చిన్నప్పటినుండీ నాకు లేదు.

మా నాన్నగారు (ఎం. ఆర్. రాధ) ప్రముఖ నటుడయినందు వల్ల, ఆయన నటించిన చిత్రాలు చూసి, ఆయిన్స్పిరేషన్‌తో ఆయనంత పేరును సంపాదించుకోవాలని కూడా ఏనాడూ నేను ఆశించలేదు. పోనీ నా తల్లిదండ్రులకన్నా నన్నొక నటిగా చూడాలన్న భావం కలిగిందా అంటే అదీలేదు. అయినా నేను తారనయ్యాను.

అప్పుడు ప్రముఖ దర్శకుడు భారతీరాజా కిళక్కే పోగుం రైల్ చిత్రంలో ఒక నూతన తారను పరిచయం చెయ్యాలన్న అభిప్రాయంతో వున్నారు.

ఎవరో నా ఫోటోను ఆయనకు చూపించారట.

'సినిమాకు తగిన అందం ఈ అమ్మాయిలో కొంత వుంది. పైగా ప్రముఖ నటుడి కూతురయినందువల్ల నటన కూడా ఈ అమ్మాయిలో అంతర్లీనమై వుంటుందని' ఆయన భావించి వుండవచ్చు. పైగా నా అదృష్టమూ కలిసొచ్చింది. ఆచిత్రంలో కథానాయికగా బుక్ అయ్యాను. నేనలా తారనయ్యానండి !!

# చిత్రసీమకు మూడు తరాల సేవ



మా అమ్మాయి స్రవంతిని హీరోయిన్‌గా చేయాలనుకుంటున్నాను" అని తన కోరిక వెలిబుచ్చింది జమున యిటీవల కలిసినప్పుడు.

సాధారణంగా సినీరంగాలలో వున్నవాళ్ళు తమ సంతానాన్ని మాత్రం సినిమా రంగానికి దూరంగా వుంచాలనుకొంటున్నాను అని అంటారు.

ఈ విషయంలో జమున తన అభిప్రాయం చెప్తూ-- "సినిమా రంగంలో కీర్తి ప్రతిష్టలు, డబ్బు సంపాదిస్తూ ఆరంగంపై సదభిప్రాయం లేనట్లూ మాట్లాడటం ఆత్మద్రోహం చేసుకోవటం నాకిష్టంలేదు. అలాంటి పరిస్థితులలో ఆ రంగం నుండి విరమించటం వుత్తమం" అన్నారు.

గత పది సంవత్సరాలుగా బొమ్మల కొలువు వేడుక వచ్చినప్పుడల్లా నాకూ ఒక ఆడపిల్ల వుంటేబాగుంటుంది అని కలలుకంటూ వుండేదానిని. మంత్రాలయ రాఘవేంద్రస్వామి పూజలుచేసూ అనేకసార్లు మంత్రాలయం వెళ్ళాను. నా పూజలు ఫలించాయి. నేను కోరుకొన్నవిధంగా ఆడపిల్ల పుట్టింది. మా యింట్లో ఒక రబ్బరు బొమ్మ వుంది. యీ బొమ్మను చూసినప్పుడల్లా యిలాంటి పాపాయి కావాలని కలలుగన్నాను. బొమ్మలాంటి అమ్మాయే పుట్టింది. అది నాలదృష్టం" అన్నారు జమున పాపను చూసుకుని మురిసిపోతూ.

జమున తల్లి శ్రీమతి నిప్పాణికౌసల్యాదేవి 12 వ ఏట నుండే హరికథలుచెప్తూ రాష్ట్రంలోనూ, యితర రాష్ట్రాలలో అనేక ప్రశంసలు పొందారు. తన కూతురు జమున గురించి మాట్లాడుతూ మా అమ్మాయి రెండవ ఏట నుండే సంగీతపై ఆశక్తిచూపుతూ నృత్యం చేస్తుండేది. నటిగా తీర్చిదిద్దాలన్న నా కోరిక నెరవేరింది. యీనాడు నా మనుమరాలిని కూడా నటిగా రూపొందించాలని మా అమ్మాయి నిర్ణయించుకోవటం నాకెంతో ఆనందంగా వుంది. మా మనుమరాలినికూడా ఒక కళాకారిణిగా చూడాలని నాకోరిక. మా స్రవంతి కూడా కళాకారిణి అయితే మా మూడుతరాలు కళకు సేవ చేసినవాళ్ళంగా మాది కళాకారుల వంశం అని చెప్పుకోవచ్చు అన్నారు.

**-శరత్‌కుమార్**

* * *




కలర్ ఫోటో: మోహన్‌జీ జగన్

# పగబట్టిన సింహం

వాహినీ పదవ ఫ్లోరుముందు చాలామంది జూనియర్ ఆర్టిస్టులు కనిపించారు. షూటింగ్ ఎవరిదై వుంటుందబ్బాఅని ఆలోచించు కుంటూ ఫ్లోర్‌లోకి వెళ్ళబోతుంటే ఎన్.వి. సుబ్బరాజు సినిమా పత్రికను "రండి. ఇదిమనషూటింగ్" అన్నారు లోపలికి అడుగుపెట్టే సరికి.

"కింద చందమామతో
విశ్శంగోడ్డు ఆడినట్లు
దిక్కులన్నీ అదిరిపడ్డవి
అరెరె రెరెరెరే
చుక్కలన్నీ చెదిరిపడ్డవి"

అంటూ పాటవినిపిస్తోంటే కృష్ణ, జయప్రద, గీత, జ్యోతిలక్ష్మిలకు చేయవలసిన మూమెంట్‌ను వివరిస్తున్నారు నృత్య దర్శకుడు శ్రీను.

హీరో ఎవరు ?

ఇంతలో అల్లురామలింగయ్య సెట్‌లోకి వచ్చారు. లాల్చీ వేసుకొని, భుజంమీద కండువా వేసుకొని, మంచి యంగ్ గెటప్‌లో ఠీవిగా నడచివస్తున్న అల్లుని చూసి....

"ఏమిటి ప్రేమాభిషేకం గెటప్. పాపారాయుడి పోజు కొట్టుకుంటూ వస్తున్నారు. హీరో అయిపోవాలని ట్రై చేస్తున్నారా ఏమిటి? నేను యిప్పుడే రామారావు, నాగేశ్వరరావు గార్లకు చెపుతాను" అంటూ సరదాగా అల్లుని ఆటపట్టించారు కృష్ణ.

"అయ్యా మీరు హీరోలు. మేము కమెడియన్స్— సినిమాల్లో ఎలాగూ ఏడిపిస్తారు. బయటయినా మమ్మల్ని మామూలుగా ఉండనియ్యండయ్యా!" అంటూ మందు కొట్టినవాడిలా మత్తు ఎక్కుతున్న వాడిలా నటిస్తూ మాస్టారు దేసరికి— అక్కడ సెట్ లైటింగ్ ఎరేంజ్‌మెంట్స్‌ని పర్యవేక్షిస్తున్న దర్శకులు పి. చంద్రశేఖర్‌రెడ్డి.



కృష్ణ 'పగబట్టిన సింహం'

## అల్లు వెంట అమ్మాయిలు

"ఏమండీ రామలింగయ్యగారు మీ షాట్ యింకా అరగంట తర్వాత తీస్తాము. ఇప్పట్నుంచే త్రాగుబోతు మూడ్‌లో మీరు ఉండనవసరం లేదు. షాట్ తీసే ముందు మీకు చెపుతాను. అప్పుడు త్రాగుబోతు మూడ్ లోకి వద్దురుగాని" అన్నారు.

అక్కడ వున్న కృష్ణ "ఏమిటి ఈయన త్రాగుబోతు మూడ్‌లో సాంగ్ పాడుతారా యిప్పుడు మీరు తీసే షాట్‌లో" అని అడిగారు.

"ఈ చిత్రంలో ఈయనకు అమ్మాయిలంటే భలే యిష్టం. కనిపించిన ప్రతి అమ్మాయి వెంట పడుతూ ఉంటాడు. ఎంత మంది అమ్మాయిల దగ్గరికి పెళ్ళి చూపులకు వెళ్ళినా ఏదో ఒక ఇబ్బంది ఎదురవుతోంది. ఓసారి ఓ మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చూపులకని బయలుదేర బోతూ.

"అయ్యా మీరు ఆ అమ్మాయిని పెళ్ళి చూపులు చూడటానికి వెళ్ళకూడదు" అని అల్లు రామలింగయ్య [illegible] యన అతన్ని ఆపుతాడు.


"ఏమిటయ్యా నాకు యిప్పుడు ఏంతక్కువయింగని" అని అల్లు

## వెత్రి అంటే విజయం

సినిమా షూటింగ్ఆరంభంలో సాధారణంగా ముహూర్తం షాట్స్‌ను దేవుళ్ళ పటాలమీద తియ్యడం కొందరి అలవాటు. ప్రముఖ నిర్మాత కే. శే. దేవర్, తన ప్రతి సినిమా ముహూర్తం షాట్‌లో 'వెత్రి' (విజయం) అన్న డైలాగుతో ఆరంభం చేస్తారు. ఆఖరికి 'వెత్రి' అన్న డైలాగు సినిమాలో లేకపోయినా అలా తియ్యడం ఆయన సెంటిమెంట్.

ప్రముఖ నటుడు శ్రీ ఎం. జి. ఆర్. తను నటించే ప్రతీచిత్రం ప్రారంభషాట్‌లో హీరోయిన్‌తో కలిసి డ్యూయట్ పాడుతున్నట్లు చెయ్యడం ఆయన సెంటిమెంట్. ఇలా ఒక్కొక్కళ్ళకూ ఒక్కొక్క విధమైన సెంటిమెంట్స్ వుంటాయి.

సడన్‌గా నటించనంటే ఎల్లాగా?
ఈ కథలో హీరోయిన్ కేరెక్టర్ వేండే
డూయెట్ షాటెట్లా వస్తుందయ్యా మగడా..!?



రెచ్చిపోతే....

"బాబూ ఆ అమ్మాయి తల్లిని 20 సంవత్సరాల క్రితం మీరు పెళ్ళి చూపులంటూ వెళ్ళి చూసారు. కనుక యిప్పుడు ఈ అమ్మాయి మీకు కూతురు వరస. మిమ్మల్ని ప్రేమిస్తోందని తెలిసి భయపడి ఆ ప్రయత్నం మానేస్తాడు.

యిలా రకరకాలుగా సరదాగా సాగే ఈయన పాత్ర ఈ రోజు తీసే సాంగ్‌లో "మనసు గతి



'పగబట్టిన సింహం' కృష్ణతో సోదరుడు శేషగిరిరావు, జయప్రద


అవుతుంది కనుక మీరు వెళ్ళకూడదు" అని చెప్పేసరికి "ఇదీ నిజమే" అని ఆగిపోతాడు.

అలాగే గీతను లవ్ చేస్తాడు. గీత పోలీస్ ఆఫీసర్ అయినందువల్ల ... యింతే" అంటూ మందు చేతితో పట్టుకొని బాధపడే బిట్స్ తీయాలి.

ఆ తర్వాత డాన్స్‌లో జ్యోతిలక్ష్మి పోజుచూసి "భలేమంచి పోజు ఖరీదైన పోజు" అంటూ జ్యోతిలక్ష్మి వెంట పడే షాట్స్ చిత్రీకరించాలి" అన్నారు చంద్రశేఖరరెడ్డి.

## పాములతో నటించను

తూయవన్ అనే తమిళ రచయిత, ఒక తమిళ కధనురాసి రతి అగ్నిహోత్రిని హీరోయిన్‌గా బుక్ చెయ్యడం కోసరం, ఆమె దగ్గరకువెళ్ళి కధను పూర్తిగా వినిపించారు. కధంతా విన్న రతి, హఠాత్తుగానేచి. ఒక మాటయినా చెప్పకుండా, లోపలికి వెళ్ళిపోయింది అశ్రద్ధగా. తెల్లబోయి చూస్తున్న తూయవన్ దగ్గరకు రతి తల్లివచ్చి, మా అమ్మాయికి పాములతో నటించడం అంటే యిష్టంలేదు. మీరు హీరోయిన్‌గా మరొకర్ని బుక్ చేసుకోండని ఆవిడా లోపలికి వెళ్ళిపోయింది. తూయవన్ బయటకు వచ్చేసారు.




## అల్లు-కృష్ణ సంవాదం

"మొత్తానికి ఈ చిత్రంలో పాట పాడుతారన్న మాట" అన్నారు అల్లురామలింగయ్యతో కృష్ణ. "ఈ పాటలోవి బిట్‌లే కాకుండా అల్లురామలింగయ్య, గీతలపైన ఓపాట చిత్రీకరించాలనుకుంటున్నామండీ" అన్నారు సమన్వయకులు సుబ్బరాజు.

"ఓహో అదీ సంగతి అందుకే యింత పోజుకొడుతూ సెట్లోకి వచ్చారు" అని వాళ్ళు అల్లుని చూపిస్తూ అనేసరికి

స్టూడియో సంచారం

"నాయనా కృష్ణ యిక ఆ విషయం వదిలెయ్. పడగా పడగా ఈ గెటప్‌లో నీ కళ్ళముందు పడ్డాను" అన్నారు. "సరే మీరు కాసేపు ప్రక్కన ఉండండి ఈ షాట్‌లో మీరు లేరు. షాట్‌లో మిరు లేకుండా యిప్పుడు యిక్కడికి ఎందుకు వచ్చారు అనవసరంగా మమ్మల్ని నవ్విస్తూ టైమ్ వేస్ట్ చేయించడానికా?" అని అడిగారు అల్లుని కృష్ణ.

"ఏడీ ఆ అసిస్టెంట్ డైరెక్టర్ ఎక్కడ? నన్ను రమ్మన్నాడు. షాట్ రెడీ అన్నాడు. అతను ఏడండీ" అంటూ సెట్ అంతా వెతుకుతున్నారు.

"మీరు అడుగుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ అడుగో ఫ్లోర్ బయటనుంచి సెట్‌లోకి వస్తున్నాడు చూడండి" అని కృష్ణ చెప్పగానే అల్లు సీరియస్‌గా.

"ఏమయ్యా షాట్ రెడీ అంటూ వచ్చావు యింకా రెడీ అవలేదంట కదా" అని నిలదీసి అడిగారు

"ఆ విషయమే మీతో చెపుదామని బయటకు వెళ్ళి మీ కోసం నేను వెతుకుతున్నానండి" అన్నాడు అతను.


"నేనుయిక్కడేఉన్నానుకదా" అని అల్లురామలింగయ్య ఆశ్చర్యంగా చూస్తుంటే.

## సెక్స్ రోల్స్ వద్దు

బాలనటిగా సుమతికి మంచి పేరుంది. కాలం మారింది. నేడు తమిళం, మలయాళం చిత్రాలలో హీరోయిన్‌గా నటిస్తుంది. మధురైలో సుమతి అభిమానులు సుమతి పేరుతో ఒక సంఘాన్ని పెట్టారు. దానిపేరు హేమ నక్షత్రం సుమతి సంఘం.

ఉదయం ఐదు గంటలకు తండ్రితో కలిసి సైకిల్‌మీద మాంబళంలో విహరిస్తుంది ఎక్సర్‌సైజ్ అంటూ. టైలరింగ్‌లో సుమతి ఎక్స్‌పర్ట్. తనకు కావలసిన జాకెట్లను వివిధరకాల ఫ్యాషన్స్‌తో తనే కుడుతుంది.

తనని సినిమాలో బుక్ చెయ్యడానికి నిర్మాతలు యింటికి వచ్చారంటే, ముందుగా వాళ్ళతో "సార్, దయచేసి నాకు సెక్స్ రోల్స్ యివ్వకండి. ఫ్యామిలీ టైపు రోల్స్ యివ్వండి ; అంటుంది. అంటే సుమతికి వచ్చే రోల్స్‌అన్నీ సెక్సీ రోల్సేనా ???





"యింతమంది ఆర్టిస్టుల మధ్యలో మీరు కనపడలేదేమో" అంటూ జోక్ చేసారు లక్ష్మణ గోరే

కృష్ణ త్రిపాత్రాభినయం ప్రత్యేక ఆకర్షణగా ఉండే ఈ చిత్రంలో సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, సారధి, నాగభూషణం, పుష్పలత, జ్యోతిలక్ష్మి, త్యాగరాజు, భీమరాజు నటిస్తారని దర్శకుడు చంద్రశేఖరరెడ్డి చెప్పారు.

సుబ్బరాజు చిత్రంలోని టెక్నిషియన్స్‌ను గురించి చెపుతూ "మాటలు మోదుకూరి జాన్సన్; పాటలు వేటూరి, సంగీతం సత్యం; ఫోటోగ్రఫీ ఎసెస్. లాల్, కళ చలం, ఎడిటర్ నాయని మహేశ్వరరావు, మేకప్ గోవింద్, మాధవరావు, ప్రొడక్షన్: ధృవకుమార్, నిర్వహణ: కె. వెంకటరామరాజు, సోసియేట్ డైరక్టర్స్: సి. రాధారెడ్డి, బి. నాగేశ్వరరావు. అసిస్టెంట్ డైరెక్టర్: కె. జయప్రసాద్‌రెడ్డి, నిర్మాత: కలిదిండి విశ్వనాధరాజు, కథ-సమర్పణ: నేనే" అంటూ ముగించారు. యిన్ని వివరాలు చెప్పారు యింతకీ—

ఈ చిత్రానికి పేరు ఏమని పెట్టారో చెప్పాలన్న విషయం సుబ్బరాజుగారికి గుర్తు లేదను కుంటాను అంటూ ప్రక్కనే ఉన్న నిర్మాత విశ్వనాథరాజు "మా చిత్రానికి 'పగబట్టిన సింహం' అన్న పేరు ఖాయం చేసాం. చంద్ర సినీ ఆర్ట్స్ పతాకంపై నిర్మిస్తున్నాం" అని చెప్పారు. అక్కడి వివరాలన్ని తీసుకొని ఫ్లోర్ బయటకు వచ్చాను.



# స్టూడియో సంచారం

## నిప్పుతో చెలగాటం

వాహినీ 5వ ఫ్లోర్ లోకి అడుగుపెట్టేసరికి డైరెక్టర్ కొమ్మినేని కృష్ణంరాజు—శరత్‌బాబులతో కొన్ని దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. సినిమా పత్రిక అక్కడకు వెళ్ళిన వెంటనే రవిచిత్ర ఫిలింస్ పతాకంపై వై. వి. రావు నిర్మిస్తున్న నిప్పుతో చెలగాటం షూటింగ్ అని దర్శకులు కొమ్మినేని చెప్పారు.

ఇంతలో ఓ పోలీస్ వచ్చి కొమ్మినేనికి మంచి నీళ్ళు యిచ్చాడు. ఏమిటి పోలీసులతో మంచినీళ్ళు తెప్పించుకుంటున్నారు? అని సరదాగా అడిగాను.

"ఇది జైలు సెట్ కదా .... పోలీస్ వేషం మా ప్రొడక్షన్ బోయ్ ఒకడు వేశాడు. వేషం వేసినా అతని డ్యూటీ గాప్‌లో చేయక తప్పదు కదా అందుకే అతని పని అతను చేసుకుంటున్నాడు" అన్నారు.

రవిచిత్ర వారి "నిప్పుతో చెలగాటం" చిత్రాన్ని ఉగాదికి విడుదల చేయాలనుకుంటున్నట్లుగా కొమ్మినేని తెలియపర్చారు

కృష్ణంరాజు ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో యింకా జయసుధ, శారద, శరత్‌బాబు, కవిత, రావుగోపాలరావు, అల్లు రామలింగయ్య మరియు కరుణామయుడు విజయచందర్ నటిస్తున్నట్టుగా తెలియచేశారు.

## కొమ్మినేని కొత్త చిత్రాలు

"కొత్త చిత్రాలు ఏమయినా అంగీకరించారా?" అని అడిగిన ప్రశ్నకు కొమ్మినేని సమాధానమిస్తూ రెండు చిత్రాలు అంగీకరించాను.

జి. వి. కె. ప్రొడక్షన్స్ పతాకంపై నవభారత్ బాబురావు నిర్మించే "పెళ్ళిళ్ళ పేరయ్య" చిత్రం ఫిబ్రవరిలో ప్రారంభం అవుతుంది. నారాయణ రావు, చంద్రమోహన్, ప్రభ, గిరిబాబు, గీత, నూతన్ ప్రసాద్, కృష్ణవేణి, సత్యనారాయణ, అల్లురామలింగయ్య నటిస్తారు.

నటభూషణ శోభన్ బాబు ద్విపాత్రాభినయంతో శాయికృష్ణ ఎంటర్‌ప్రైజెస్ వారు నిర్మించే తొలిచిత్రం మార్చిలో ప్రారంభం అవుతుంది"

అంటూ తన రెండు కొత్త చిత్రాలగురించి వివరించారు.

"1981లో మీరు దర్శకత్వం వహించిన ఏ ఒక్క చిత్రమూ విడుదల కాలేదు కారణం ఏమిటి?" అని అడిగితే—

"ఆ విషయం నాకు ఎంతో బాధ కలిగిస్తోంది. 1981 లో శివాజీగణేశన్, కె. ఆర్. విజయలతో నా దర్శకత్వంలో తయారయిన 'సత్యం—సుందరం' తమిళ చిత్రం విడుదలయి విజయవంతం అయిందన్న ఆనందంతోపాటు. 1982 లో నేను దర్శకత్వం వహించిన ఏ ఒక్క చిత్రమూ విడుదలకాకపోవడం నాకు చాలా బాధగానే ఉందని" చెప్పారు— ఇక కొత్తవిశేషాలు ఏమీ లేవనుకొని—

సినిమా పత్రిక అక్కడనుండి లేవబోతుంటే ఏమండోయ్ యింకో ముఖ్యవిశేషం అంటూ కొమ్మినేని అనడంతో మళ్ళీ కూర్చున్నాను—

## బాలుపాట కచేరి

"కర్ణాటక సంగీతంలో ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం కచ్చేరి. త్వరగా మీ సీట్లను రిజర్వ్ చేసుకోండి!"

అన్న ప్రకటనలువేసి, చాలా టికెట్స్ అమ్మేశారు బెంగళూరులో వున్న ఒక సంస్థవారు. కచ్చేరి జరగవలసిన రోజునాడు, సంస్థ నిర్వాహకులు

"అనివార్య కారణాలవల్ల ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యంగారు రాలేకపోయారు. బదులుగా మరొక విద్వాంసుడి కచ్చేరి వినండ"ని మరొకరిని తెచ్చి, కచ్చేరి జరిపించారు. ఈ హంబక్ పని కొత్త పైపులో వుంది కదూ !!





కొమ్మినేని

## ఆచారి అమెరికా యాత్రలో కొమ్మినేని

1982 లో దాసరి నారాయణ రావుగారి దర్శకత్వంలో ఆయనే హీరోగా నటించే "ఆచారి అమెరికా యాత్ర" లో నేను ఒక ముఖ్యపాత్ర పోషిస్తున్నాను.

చాలాకాలం తర్వాత దాసరిగారి దర్శకత్వంలో నటించే అవకాశం రావడం నిజంగా నాకు ఓ గొప్ప విశేషం. ఈ చిత్రం మే 6 నుండి అమెరికాలో షూటింగ్ జరుగుతుంది—" అని తెలియపర్చారు.


తీస్తున్నవి జైలు దృశ్యాలు కనుక కృష్ణంరాజు—శరత్‌బాబులు తీయబోయే షాట్‌ని రిహార్సల్ చేసుకుంటున్నారు. వాళ్ళని డిస్టర్బ్ చేయడం నాకు యిష్టంలేక మరోసారి వారిద్దరినీ కలుద్దామనే ఉద్దేశ్యంతో బయటకు నడిచాను.

## ప్రేమ సంకెళ్ళు

విజయా గార్డెన్స్‌కు వెళ్ళే సరికి బయట "విజయకృష్ణా మూవీస్ ప్రేమ సంకెళ్ళు వెల్‌కమ్స్ టు ఆల్" అన్న అందమైన బోర్డ్ కనిపించింది.

విజయాగార్డెన్స్ మెయిన్ గేట్ నుండి డీలక్స్ థియేటర్ వరకు అత్యంత సుందరంగా చేసిన అలంకరణను చూస్తూ, ఆ అలంకరణ చేయించిన ఆర్ట్ డైరెక్టర్‌కు మంచి టేస్ట్ ఉందని గ్రహించి మనసులోనే అతన్ని అభినందించుకుంటూ డీలక్స్ థియేటర్‌వైపు వెళ్ళాను.

## స్టూడియో సంచారం




"ప్రేమసంకెళ్ళు" నరేష్‌కుమార్ శ్యామల.

## బుగ్గపై నొక్కు నల్ల మామయ్యా

నాకు రజనీకాంత్‌కి అప్పుడప్పుడూ చిన్నచిన్న తగాదాలు వస్తుంటాయి. 'భైరవి' తమిళ చిత్రంలో ఒక పాటలో "బుగ్గపై నొక్కున్న చిన్నమ్మా" అన్న లైను వుంది.

నేను నవ్వితే బుగ్గలోగుంట పడుతుంది కాబట్టి కవి నన్ను దృష్టిలో పెట్టుకుని, ఆ లైను రాశారని ఏడిపించారు రజనీకాంత్.

అదేపాట మధ్యలో ఒక చోట "కరుత్త మచ్చానే" అన్న లైను వుంది. అంటే నల్లమామయ్యా అని అర్థం. వెంటనే నేను "కవిగారు మిమ్మల్ని కూడా దృష్టిలో వుంచుకుని రాశారండోయ్" అని దెబ్బకుదెబ్బ కొట్టాను. రజనీకాంత్‌గారి ముఖం ఎలాగో అయిపోయింది.




## హీరోగా విజయనిర్మల కొడుకు

ఇంతలో 'ప్రేమసంకెళ్ళు' చిత్రం దర్శకురాలు విజయనిర్మల, ఆవిడతోపాటు ఓ అందమైన యువకుడు కారులో దిగారు. "యితనే మా 'ప్రేమసంకెళ్ళు' చిత్రం కథానాయకుడు, మా అబ్బాయి నరేష్‌కుమార్" అంటూ పరిచయం చేసారు.

వెంటనే నరేష్‌కుమార్‌ను ఇంటర్వ్యూ చేసాను. ఆ ఇంటర్వ్యూలో—

"తనకు చిన్ననాటినుండి చిత్ర పరిశ్రమపై ఒక మంచి అభి

ప్రాయంఉందని, నటనలో ఇంతకు ముందు అనుభవం లేకపోయినా చెప్పగానే అర్థం చేసుకునే శక్తి, చేయగలనన్న నమ్మకం నాలో ఉన్నాయని అందుకే ధైర్యంగా హీరోగా నటించడానికి అంగీకరించానని చెప్పారు.

### జేమ్స్‌బాండ్ లక్షణాలు


"నరేష్‌కుమార్‌కు హీరో లక్షణాలు చాలా ఉన్నాయి" అన్నారు అక్కడ ఉన్న విజయనిర్మల సోదరులు శ్రీ రఘునాధ్.

"ఏమిటి అవి?" అని ఆశ్చర్యంగా అడిగాను.

"ఈ సంవత్సరం కారురేస్‌లో ఫస్ట్ ప్రైజ్ సంపాదించుకొన్నారు. మోటర్ సైకిల్ ఫీట్స్ అద్భుతంగా చేస్తారు. కరాటే నేర్చుకున్నారు. స్విమ్మింగ్‌లో మంచి అనుభవం గడించారు. డాన్స్ కూడా నేర్చుకుంటున్నారు" అని వివరాలు తెలియపర్చారు.



శ్యామల
"ప్రేమసంకెళ్ళు"



మోటర్ సైకిల్ ఎక్స్‌పర్ట్ మొనగాడు నరేష్‌కుమార్

"నిజంగా యివన్నీ అసలైన హీరోకి ఉండవలసిన లక్షణాలే; కాబట్టి నరేశ్‌కుమార్‌తో చిత్రాలు తీసేవారికి డూప్‌షాట్లు తీయాల్సిన అవసరం ఉండదు. ఎందుకంటే ఆయనకు ఒరిజినల్‌గానే హీరోయిజమ్ ఉందికనుక" అన్నాను దర్శకురాలు విజయనిర్మలతో.

తెలుగు, తమిళ, హిందీ, యింగ్లీషు భాషలలో మంచి ప్రావీణ్యంఉన్న నరేష్‌కుమార్ మంచి అందగాడు. అందానికి తగినట్లుగా మంచినడవడి, పెద్దల పట్ల వినయవిధేతలు అతని వ్యక్తిత్వాన్ని మరింత ఉన్నతంగా తయారుచేసాయి.

"హీరో చాలా బాగున్నాడు. మరి హీరోయిన్ సంగతి ఏమిటి?" అని అడిగాను అందుకు ఆవిడ సమాధానమిస్తూ.

### తగిన హీరోయిన్ దొరకలేదు

"కొత్త హీరోయిన్ కావాలని అన్ని పత్రికలలో ప్రకటించిన విషయం మీకు తెలుసుకదా. ఆ ప్రకటనవేసిన తేదీనుంచి రోజుకు ఏవరేజ్‌గా పదిమంది అమ్మాయిలు నన్ను కలిసేవారు. మా కధకు సరిపోయే హీరోయిన్‌గా ఎన్నిక చేయడానికి వచ్చిన వాళ్ళలో ఎవరూ కనిపించలేదు.

డైరెక్ట్‌గా వచ్చి కలిసిన వాళ్ళే కాకుండా కొన్ని వేల ఫోటోలు హీరోయిన్ ఛాన్స్ కోసం మా ఆఫీస్‌కు వచ్చాయి. వాటిలో పదకొండు సంవత్సరాల వయసు కల అమ్మాయిల దగ్గర్నుంచి నలభై ఏళ్ళ వయసు కలిగిన వారి వరకు ఉండడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

కొంతమంది మొఖంలో 30 ఏళ్ళు కనిపిస్తున్న తమకు 16 ఏళ్ళు, 17ఏళ్ళు అంటూ అబద్ధాలు వ్రాసినవారు.

కొంతమంది తమ లోపాలను కప్పిపుచ్చుకుంటూ స్టిల్స్ తీయించి పంపినవారు— చాలా మంది ఉన్నారు—.

స్టూడియో సంచారం

దాదాపు రెండు నెలలనుంచి ఈ హీరోయిన్ అన్వేషణతోనే చాలా సమయం వృధా అయింది. కానీ వచ్చిన అన్ని వేల ఫొటోలలో మాకు బాగా నచ్చిన ఫొటోలు యిద్దరివి మాత్రమే. ఆ ఇద్దరిలో ఒక అమ్మాయిని బ్లాక్ అండ్ వైట్ స్టిల్స్‌లో ఉన్నంత గ్లామర్‌గా కలర్ స్టిల్స్‌లో లేకపోవడం వలన, హైట్ ప్రాబ్లెమ్ వలన వద్దనుకున్నాము.

యిప్పుడు మేము సెలెక్ట్ చేసిన అమ్మాయి మాకు అన్ని విధాల నచ్చింది. బొంబాయినుంచి ఆ అమ్మాయిని పిలిపించి— మా నరేశ్‌కుమార్‌తో జంటగా చాలా స్టిల్స్ తీసాం. స్క్రీన్ టెస్ట్ కోసం నరేశ్‌కుమార్‌తో కలసి నటించిన కొన్ని దృశ్యాలు చిత్రీకరించి రష్ చూసాం.



"ప్రేమసంకెళ్ళు" పాటలరికార్డింగ్‌లో విజయనిర్మల, కృష్ణ, శివాజీ, నరేశ్‌కుమార్, శ్యామల, స్వామినాధన్.

హీరో హీరోయిన్‌లు యిద్దరూ చూడముచ్చటగా, లవ్ స్టోరీ కథకు సరిగ్గా సరిపోయే యువ జంటలా ఉన్నారు—

అందుకే ఆ అమ్మాయిని కన్‌ఫర్మ్ చేసాం; మీరు చూడలేదా?" అని అడిగారు.

## మెరుపులాంటి శ్యామల

"లేదు" అన్నట్లు తల ఆడించాను.

వెంటనే దర్శకురాలు "శ్యామల—శ్యామల" అంటూ పిలిచేసరికి తళుక్కుమని ఓ మెరుపు మెరిసింది. ఆ అమ్మాయి మా కళ్ళముందు నిలబడింది.

అయితే "అన్ని వేలమందిలో అదృష్టవంతురాలు ఈ అమ్మాయే అన్నమాట" అన్నాను నేను.

"అవును నిజంగా అదృష్టవంతురాలే" అన్నారు విజయనిర్మల.

## పదిహారేళ్ళ వయసు

"తన పేరు శ్యామల అని, 1965 ఆగస్ట్ 10వ తేదీన జన్మించానని, హిందీ, ఇంగ్లీషు, తమిళ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని,

1980 వరకు బొంబాయిలో పదవ తరగతి పూర్తిచేసి,

1980 నుంచి 1981 వరకు ఒకసంవత్సరంకాలం మద్రాస్‌లోని ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో చేరి ఏక్టింగ్‌లో డిప్లొమా పొందానని.

ఏక్టింగ్ టెస్ట్‌లలో ఫస్ట్‌క్లాస్‌లో

## 'గ్రామ సింహం' అంటే కుక్కా?

హాసీలో 'పగపట్టిన సింహం' షూటింగ్ జరుగుతోండగా 'గ్రామసింహం' టైటిల్ బావుంటుందికదా! అంటూ ఒకాయన హీరో కృష్ణ దగ్గరకు వచ్చాడు.

కృష్ణ పక్కనేవున్న జయప్రదను, నృత్యదర్శకుడు శ్రీనును 'గ్రామసింహం' అంటే ఏమిటి? అని అడిగారు.

జయప్రద, 'గ్రామానికంతటికీ పెద్దగా వుండేవాడ్ని గ్రామ సింహంఅంటారనుకుంటున్నాను' అని చెప్పింది.

శ్రీను 'గ్రామంలో వుండె సింహాన్ని గ్రామ సింహం అంటారు' అని చెప్పారు.

కృష్ణ పక్కని నవ్వబోయి, వస్తున్న నవ్వును ఆపుకుంటూ, "ఈ ప్రశ్నకు దర్శకులు చంద్రశేఖరరెడ్డిగారు తప్ప ఎవరూ చెప్పలేరనుకుంటాను. ఆయన ఎప్పుడూ పల్లెటూరి సినిమాలు తీస్తుంటారు కనుక ఆయన్నే అడుగుదాం" అంటూ రెడ్డిగారిని పిలిచి ఆ విషయం అడిగారు—

"దీనికి సమాధానం మీకు తెలియదా?" అని చంద్రశేఖరరెడ్డి గారు తిరిగి కృష్ణను అడిగారు.

"ఎందుకు తెలియదు. గ్రామ సింహం అంటే 'కుక్క' అని అర్థం" అని చెప్పారు.

ఆ మాటకు అక్కడున్నవారు అందరూ ఘొల్లున నవ్వితే, చంద్రశేఖరరెడ్డిగారు "సాధారణంగా పల్లెటూర్లలో పెళ్ళిళ్ళకు వెళ్ళినపుడు కొంతమంది వాళ్ళ బావమరుదులను పరిచయంచేస్తూ, 'ఇతను మా గ్రామ సింహం' అంటూ సరదాగా ఏడిపిస్తుంటారు. కుక్కలనే కాకుండా కుక్కల్లా కాపలా కాసేవాడిని కూడా పల్లెటూర్లలో గ్రామసింహాలుగా భావిస్తారు" అని తెలియజేశారు. ఈసంభాషణ అంతావిన్న, గ్రామ సింహం టైటిల్‌ని పట్టుకొచ్చిన మనిషి మెల్లిగా సెట్లోంచి బయటకు వచ్చేశాడు.

పాస్ అయి తిరిగి బొంబాయి వెళ్ళిపోవడం జరిగిందని—


ఈలోగా విజయకృష్ణ మూవీస్ వారికి స్టిల్స్ పంపించడం— నాయికగా ఎన్నిక అవడం జరిగిందని తన వివరాలు తెలియపర్చింది.

ఆ వివరాలన్నీ తెలుసుకున్న తర్వాత 16 ఏళ్ళ వయసుతో; మేలిమి బంగారు రంగు ఛాయతో చక్కని కనుముక్కు తీరుతో చూపరులను ఆకర్షిస్తున్న శ్యామల తప్పకుండా అగ్రనాయికగా మారే అవకాశాలు ఉన్నాయని సినిమా పత్రిక ఆశీర్వదించింది.

"వివరాలన్నీ బాగానే ఉన్నాయి. మరి మీ హాబీలు ఏమిటి?" అని యువకథానాయిక శ్యామలను అడగగా

తనకు "కూచిపూడి భరత నాట్యం అంటే ఎంతో యిష్టం. భరత నాట్యం పోటీలలో గోల్డ్ మెడల్ పొందాను" అని తెలియచేసింది.


గుడ్- అందం- ఆకర్షణతో పాటు-నటనానుభవం, నృత్యంలో నైపుణ్యం- అన్నీ ఉన్నాయి కనుక హీరోయిన్‌లు కావాలంటూ తిరిగే నిర్మాతలంతా ఓసారి శ్యామలకు అవకాశం యిస్తే బావుంటుందని నేను అభిప్రాయ పడ్డాను.




వేటూరి వ్రాసిన పాటను బాలసుబ్రహ్మణ్యం, సుశీల పాడగా రమేష్‌నాయుడు సంగీత దర్శకత్వంలో రికార్డు చేశారు. ఈ చిత్రంలో జగ్గయ్య, ఘుంటాల, రంగనాథ్ మిగిలిన ప్రధాన పాత్రలు పోషిస్తారు.

పరిశ్రమలోని పెద్దలందరి దృష్టిలో 'తప్పకుండా పైకి వస్తారు. పెద్ద హీరో హీరోయిన్‌లు అవుతారు' అన్న నమ్మకాన్ని కలగచేసిన నరేశ్‌కుమార్ శ్యామలల యువజంట 1982 చలనచిత్ర చరిత్రలో సరికొత్త సంచలనాన్ని సృష్టిస్తుందని ఆశిద్దాం.

సరదాగా, సందడిగా జరిగిన 'ప్రేమసంకెళ్ళు' పూజ, రికార్డింగ్ కార్యక్రమానికి హాజరయిన పత్రికలవారందరికీ దర్శకురాలు విజయనిర్మల కృతజ్ఞతాభివందనాలు తెలియపర్చడంతో అక్కడ నుంచి బయలుదేరాను.



స్టూడియో సంచారం



శోభన్ బాబు, లక్ష్మి "కోరుకున్న మొగుడు"

# కోరుకున్న మొగుడు

"అందమైన అమ్మాయిలచేత అభ్యంగన స్నానం ఆదరించిన వాడు అదృష్టవంతుడు గురూ!"

## ఆడపిల్లలతో అభ్యంగన స్నానం


బాయిలర్ పొగలు సెగలతో కగులుతుంది. జయసుధ, రూపా చక్రవర్తి పొజిషన్‌లోకి వచ్చి నిలబడ్డారు. వాళ్ళిద్దరి మధ్య శోభన్ బాబు బిక్కు బిక్కుమంటూ చూస్తున్నారు.

"స్టార్టు" కట్టా ఆదేశం.

మ్యూజిక్ ఆరంభం అయింది. కెమెరా చురుగ్గా కన్ను తెరిచింది.

'టప టప టప' మని తబలా శబ్దం.

దానికి అనుగుణంగా జయసుధ. రూపాచక్రవర్తి, చమురును శోభన్ బాబు తలకు పట్టిస్తున్నట్టు "తప తప తప"మని శోభన్ తలను తమ అరచేతులతో పరామర్శించారు. ఇద్దరూ ఒకే సారి విజృంభించేసరికి, ఆ ధాటికి ఆగలేక అదిరిపోయి, అటూ ఇటూ పారిపోసాగారు. మేము అంత తేలిగ్గా విడిచి పెడతామా అన్నట్టు ఇద్దరూ చెరో వైపు పట్టి ఈడ్చి, గుంజి, కుదేసి స్నానం చేయించడం ఆరంభిస్తుండగా "కట్" అన్నారు కట్టా సంతృప్తిగా!



"కోరుకున్న మొగుడు" శోభన్ బాబు, జయసుధ

అంగనల పోటీ మధ్య అమాయకుడు ఏమవుతాడు? ఆఖరికి శోభన్ బాబు స్నానం చేశారా? చేస్తే ఎవరు ఎక్కువసేపు చేయించారు? స్నానం అయిన తర్వాత శోభన్‌గారు కొత్తబట్టలు కట్టుకుని, ఎవరితో మాట్లాడారు? వగైరా ప్రశ్నలు, ధర్మ సందేహాలు ఆ సినిమా చూస్తే గాని మనకి తెలియవు.

ఏవిటీ? సినిమా రిలీజ్ అయ్యే వరకూ ఆగనంటారా? అయితే ఆ సంగతేదో కట్టా సుబ్బారావు గారినే అడగండి. ఉత్తరం మూలంగా.

విష్ణుప్రియా ప్రొడక్షన్ వారి 'కోరుకున్న మొగుడు' చిత్రంలో ప్రధాన పాత్రలు: శోభన్ బాబు, జయసుధ, లక్ష్మి, రూపా చక్రవర్తి, నూతన్‌ప్రసాద్, సత్యనారాయణ, నాగభూషణం, రమాప్రభ, ఎస్. వరలక్ష్మి తదితరులు.

మాటలు గొల్లపూడి, సంగీతం రాజన్—నాగేంద్ర, కళ వాలి, ఎడిటింగ్ వి. ఎస్. వీరప్ప, నిర్మాత జాగర్లమూడి రాధా కృష్ణమూర్తి, దర్శకుడు కట్టా సుబ్బారావు.

✱✱✱






"కోరుకున్న మొగుడు" సెట్లో రూపా చక్రవర్తి.




'మరోమలుపు'
జ్యోతి
రామకృష్ణ



# జీవితమే నాకు ఇన్‌స్పిరేషన్
# దర్శకుడు - కట్టా!

కట్' అన్నశబ్దం విన గానే జ్ఞాపకానికొచ్చే దెవరని మిమ్మల్ని అడిగాననుకోండి.

'ఈ మాత్రం తెలి యదా ? 'దర్శకుడు' అని ఠకీమని జవాబిస్తారు మీరు.

ఆ 'కిట్' ని కాస్త సాగ దియ్యండని నేను మిమ్మల్ని అడగకముందే ఆ పనేదో మీరే చేసేసి 'కిట్‌టా' అంటారు.

కిట్టా తెలియగానే 'కట్టా సుబ్బారావుగారూ నమస్తే' అని పలకరించేస్తారు మీరు.

కట్టా చిత్రం అంటే అందులో వినోదం తప్పకవుంటుంది. ఉన్న కష్టాలు మరచిపోయి, మూడు గంటల సేపు ముచ్చటగా నవ్వు కుని, ఆనందంతో యింటికెళ్ళ వచ్చని అనుకుంటారు ప్రేక్షకులు. అందుకనే ఆయన చిత్రాలకి అంత డిమాండ్.

వి. జి. పి. గార్డెన్స్‌లో "కోరు కున్న మొగుడు" షూటింగ్‌లో వున్నారు.

చిలకమ్మా గోరింకా సరసా లాడితే నవ్వేయవ్వనం నాలో ఈదినం"

పాట బావుందికదూ ! వేటూరి సాహిత్యానికి సత్యం సంగీతావి

## కథబట్టీ టైటిల్


"ఇతర చిత్రాల టైటిల్స్‌కు మీ దర్శకత్వంలో వచ్చే సిని మాల టైటిల్స్‌కు చాలా తేడా వుంటుంది. టైటిల్స్‌లో ఒక ప్రత్యేకత కనబడాలని అలా పెడ తారా ? లేక మరేదైనా వున్నదా?"

"సాధారణంగా కథ యితి వృత్తాన్నిబట్టే టైటిల్‌ని నిర్ణ యిస్తాను. టైటిల్ వినగానే అది అందరికీ అర్థమయ్యేట్టుగా వుండాలి. అప్పుడే ఆ చిత్రంపై అందరికీ కుతూహలం కలుగు తుంది. అలా ఆకర్షించడం కోసరమే టైటిల్స్‌ని కాస్త ప్రత్యేక పంథాలో పెడతాను"

"మీరు ఎక్కువగా కుటుంబ గాథా చిత్రాలనే తీస్తుంటారు, కారణం ?"

## జీవితమేనాకు ఇన్‌స్పిరేషన్

అలాంటి చిత్రాలుతీస్తే తప్ప కుండా విజయం లభిస్తుందని నా విశ్వాసం. పైగా బాగా డబ్బుచేసు కుంటాయి. నిర్మాతలు నష్టపోరు. అది ఒకకారణం. మరొకకారణం ఏమిటంటే నాకు చాలామంది మధ్యతరగతికుటుంబీకుల జీవితం గురించి బాగా తెలుసు.




## బోడిగుండు నటులు


ఆంగ్ల నటులలో యూల్ బ్రిన్నర్ తెరమీద బోడిగుండు తోనే నటిస్తాడు.

అలాగే టెల్లీ సవలస్ అనే నటుడుకూడా. వారిద్దరూ మొదటి చిత్రంలో నటించేటప్పుడు బోడి గుండుతో నటించారు.. ఆవిధంగా ప్రేక్షకుల ఆదరణ పొందారు. వారి మొదటి చిత్రాలు విజయ వంతం అవడంతో

ఆ తర్వాత ప్రతీ చిత్రంలో బోడిగుండుతో నటిస్తేనే ప్రజలు ఆదరిస్తారనే నమ్మకం కలగడంతో ఈ ఇద్దరు నటులు బోడిగుండు తోనే దర్శనమిస్తారు.

తెలుగులో వారి ధోరణిలో స్వర్గీయ నెల్లూరుకాంతారావుకూడా బోడిగుండుతోనే నటించేవారు.

-సత్యాదేవి




నిత్యజీవితంలో జరిగే సంఘటనలే నాకు చిత్రంగా తియ్యడానికి ఇన్స్పిరేషన్‌గా వుంటుంది కాబట్టే అటువంటి చిత్రాల్ని తీయడానికి ఉత్సాహాన్ని చూపిస్తాను"

"అయితే అలాంటి ఫార్ములా టైపు పిక్చర్స్‌ని తీస్తూవుంటే, ఒక స్టేజ్‌లో జనానికి విసుగు కలుగుతుందేమోనని ఆలోచించారా ?"

"నథింగ్. సబ్జెక్టునూ వెల్లిగా చెప్పగలిగినంతవరకూ జనానికి ఎటువంటి విసుగూరాదు. నాడు గుండమ్మకథ, మిస్సమ్మ చిత్రాలు విజయం పొందినట్లే, నేడూ అలాంటి తరహాలో చిత్రాలు విజయం పొందుతున్నాయి. కాబట్టి, కుటుంబగాథా చిత్రమైనా, కథను చెప్పడంలో నూతనత్వం వుట్టిపడితే ప్రేక్షకులకెప్పుడూ విసుగురాదు.

## మల్టీస్టారర్ చిత్రాలు

మన ప్రేక్షకులకు మల్టీస్టార్స్ వున్న చిత్రాన్ని చూడాలంటే చాలా యిష్టం. అందుకనే ఎక్కువమంది నటీనటులతో చిత్రాన్ని తీసినా, ఏ పాత్రా వృధాపోకుండా జాగ్రత్త పడతాను. మీరన్నట్టు తక్కువమంది నటీనటులతో "అక్కమొగుడు చెల్లెలికాపురం" చిత్రాన్ని తీస్తున్నాను. ఆ చిత్రంలో ప్రతిపాత్రకూ ఒక సిగ్నిఫికెన్స్ వుంటుంది"

"ఆర్టు పిక్చర్ అనండి, లేక ఆఫ్‌బీట్ పిక్చర్ అనండి. అలాంటి చిత్రాన్ని మీరింతవరకూ తియ్యకపోవడానికి కారణం ?"

"ఆర్టుపిక్చర్ తియ్యాలంటే ఎక్కువ టైము కావాలి. పైగా సరైన సబ్జెక్టు దొరకాలి గదా ! నాకు అలాంటి చిత్రాల్ని తియ్యాలన్న అభిప్రాయం వున్నది. మంచికథ దొరకగానే నూతన నటీనటులతో, వచ్చే సంవత్సరం తప్పకుండా ఒక ఆర్టు పిక్చర్ని తియ్యడానికి ప్రయత్నిస్తాను"

"చిత్రాలకు దర్శకత్వం వహిస్తూ, మాటలు, పాటలుకూడా రాయాలనే ఆలోచన వున్నదా మికు ?

## కథలు కూడా రాస్తున్నాను

"టైము కుదరడం లేదండీ ప్రొద్దున ఏడింటికి ఇల్లు విడిచానంటే, షూటింగ్ వ్యవహారాలు ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోతుంది. ఇంటికి వచ్చిన తర్వాత, నిర్మాతలతో, రచయితలతో స్టోరీ డిస్కషన్ చెయ్యాలి. మర్నాడు తియ్యబోయే సన్నివేశాల్ని గురించి ఆలోచించుకోవాలి. ఇవన్నీ అయ్యేసరికి రాత్రి ఒంటి గంట అవుతుంది. కాబట్టి ప్రస్తుతం మాటలు, పాటలు వగైరాలజోలికి వెళ్ళడం లేదు. "కోడళ్ళొస్తున్నారు జాగ్రత్త !" అల్లుడుగారూ జిందాబాద్" చిత్రాలకు కథ నేను రాసినదే. అయినా దర్శకుడు దర్శకత్వంతో పాటు ఇతర రంగాల్లోనూ తలదూర్చితే తప్పకుండా డీవియేషన్ వస్తుంది"

"దర్శకుడు ఎడిటర్ అయితే దర్శకత్వం విలువలు పెరుగుతాయని విన్నాను ! మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి"

"ఎడిటింగ్ శాఖలో కొన్ని ప్రధమసూత్రాలు దర్శకుడికి తెలిసుండడం ముఖ్యం. ప్రతీఫ్రేమ్ దర్శకుడు మార్క్ చేసి, వాటి గురించి ఎడిటర్‌కు వివరించాలి. ఒక విధంగా దర్శకుడూ కూడా ఎడిటరే. దర్శకుని చివరి నిర్ణయంతోనే ఎడిటింగ్ పని పూర్తవుతుంది"

## కెమెరామెన్ నుంచి డైరెక్టర్ కి

మీరు దర్శకులుగా కాకుండా వుంటే, ఇప్పుడే రంగంలోవుండేవారు?" క్షణకాలం కళ్ళు మూసుకుని. కెమేరా వంక మక్కువగా చూస్తూ—




"నాకు మొదటనుండి ఫొటోగ్రఫీపై ఆసక్తి ఎక్కువ. బొంబాయిలో ప్రఖ్యాత ఛాయా గ్రాహకుడు శ్రీ దబ్ల్యూ ముకాధిమ్ వద్ద అప్రెంటీస్‌గా చేరాను. కొన్నాళ్ళకు షూటింగ్‌నిమిత్తమై బొంబాయికి వచ్చిన తిలక్‌గారు నన్ను కెమేరామెన్‌గా వద్దని, డైరక్టర్ కమ్మని మద్రాసుకు తీసుకుని వచ్చారు. ఆయన ఆశీర్వచనంతో గురువులు శ్రీ ప్రత్యగాత్మ ప్రేరణతో నేడు దర్శకుడిగా స్థిరపడ్డాను" అన్నారు కట్టా సుబ్బారావు. షాట్ రెడీ అయిందని తెలిసి కుర్చీలోనుంచి లేస్తూ.

—ఎల్యూ నారాయణరావ్

* * *

## ఇంటర్వ్యూ

# తెలుగు చిత్రాల్లో నటించను





ఆ సూపర్ స్టయిల్‌కి నోరు వెళ్లబెట్టి ఆశ్చర్యంగా చూస్తోంది శ్రీప్రియ.

"దటీజ్ రజనీ స్టయిల్."

"చిలకమ్మ చెప్పింది" చిత్రాన్ని చూస్తున్న షోకిల్లారాయుడు అన్నాడు చప్పట్లు చరుస్తూ. ఆ తర్వాత ఇంటర్‌వెల్‌లో చాలా మంది రజనీలా సిగరెట్స్ ఎగరవేసి, కాలవలో పడేసుకుని, వెక్కి ముఖాలు వేశారులెండి అది వేరే విషయం.

## స్టయిల్!

తనకంటూ ఒక ప్రత్యేకత సంతరించుకుని, విభిన్న రకాల పాత్రల్ని పోషిస్తూ, ఆఖరికి వయసుమళ్ళిన పాత్రల్ని కూడా స్టయిలిష్‌గా నటించి, మెప్పు పొందడం ఒక్కరజనీకాంత్‌వల్లనే సాధ్యమయింది. రజనీతో మాట్లాడితే ఎన్నో కొత్త సంగతులు తెలుస్తుంటాయి. కాబట్టి, తెలుసుకుందామని, అరుణాచలం స్టూడియోకు వెళ్ళాను.

అక్కడ శ్రీ డి.రామానాయుడి గారి తమిళచిత్రం "తనికాట్టు రాజా" షూటింగ్ జరుగుతుంది! లంచ్ టైంలో భోజనం ముగించి ఒక చెట్టుక్రింద తమిళ పుస్తకం చదువుకుంటూ వున్నారు రజనీకాంత్. భోజనం చేసారని తెలిసి కూడా, తెలియనట్టు, "భోజనం అయిందాండి?" అంటూ అడిగాను.

నవ్వుతూ తలూపారు.

"మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలని వుందండి. మొహమాటపడకుండా జవాబు చెబుతారా?" అడిగాను.

ఎలాంటి వాటికీ భయపడని రజనీ, 'షూర్!' అన్నారు.

"సినిమా రంగానికి ఎందుకొచ్చారని కొంతమందిని అడిగితే కళాసేవకోసం, కళామ తల్లిని పూజించడం కోసం వచ్చామని అంటారు. మీరీ రంగానికొచ్చింది కళాసేవకా? లేక డబ్బు కోసమా?" మనసులో మాటను బయటపెట్టాను- నాప్రశ్నవిని క్షణకాలం నవ్వి.

"కండక్టర్ ఉద్యోగం చేస్తున్నప్పుడు, నా జీవితంలో ఒక మార్పు రావాలని ఆశించాను. అదృష్టవశాత్తు మార్పు వచ్చింది. నేనీ రంగంలోకి వచ్చింది డబ్బు సంపాదించడంకోసం, నా జీవనంలో మార్పురావడం కోసం, అంతకన్నామరేదీలేదు" అన్నారు రజనీకాంత్ చేతితో క్రాఫ్‌ని చెరిపేసుకుంటూ.

క్రాఫ్ ఎంతచెరిగిపోతే అంత బావుంటారు రజనీకాంత్.

"అయితే ఆ మార్పు ఎలా వచ్చిందో చెబుతారా?" అన్నాను యింకా సందేహం తీరక.

## ఇన్‌స్పిరేషన్

"అసలు నాకు నటుడినవ్వాలన్న ఆశ ఏ కోశానాలేదు. కానీ ఒకసారి శివాజీగణేషన్ గారి చిత్రంచూసి, ఆయన అద్భుతమైన నటనకు ముగ్ధుడినై, ఆ ఇన్‌స్పిరేషన్‌తో నేనూ నటుడినవ్వాలనుకున్నాను. తర్వాత మద్రాసులో ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్‌లో యాక్టింగ్ కోర్సులో చేరాను. నేను చేరిన కొన్నాళ్ళకు ప్రముఖ దర్శకులు, నా గురుదేవులు శ్రీ బాలచందర్‌గారు నన్ను తన నాలుగు చిత్రాలలో బుక్‌చేసారు. అవి: అపూర్వరాగంగళ్ మూండ్రు ముడిచ్చి, అంతులేని కథ, అవర్‌గళ్ చిత్రాలు. నటనలో నాకు గురువైన శ్రీ బాలచందర్‌కి నేనెప్పుడూ ఋణపడివుంటాను," అన్నారు గతాన్ని తియ్యగా గుర్తుచేసుకుంటూ....

"బాలచందర్‌గారి చిత్రాల్లో మాత్రం మీరు అద్భుతంగా నటిస్తారని అంటారందరూ! కారణం ఏమిటో చెబుతారా?" అడిగాను.

"ఏ ఆర్టిస్టును ఎలా ఉపయోగించుకోవాలో బాలచందర్‌గారికి బాగా తెలుసు. నటుడిని దృష్టిలో పెట్టుకుని అద్భుతమైన పాత్రల్ని సృష్టిస్తారాయన. హి ఈజ్ ఎ గ్రేట్ డైరక్టర్," తన గురువుగారి గురించి క్షణకాలం మురిసిపోయారు రజనీకాంత్.

సినిమాలద్వారా సమాజంలో ఏదైనా ప్రయోజనాలుసాధించడం సాధ్యమా అని అడిగినప్పుడు, "జనానికి వినోదాన్ని కలిగించడమే సినిమా ముఖ్యోద్దేశం...., కానీ, విద్యాబోధనకు కూడా సినిమా ఉపయోగకరం కావచ్చని నా అభిప్రాయం" అన్నారు రజనీకాంత్.

## ఇకనుండి తెలుగు చిత్రాలలో నటించను


"చిలకమ్మ చెప్పింది, అన్నదమ్ముల సవాల్, మీసం కోసం యింకా చాలా తెలుగు చిత్రాలలో నటించిన మీరు, ఈ మధ్య తెలుగులో నటించక పోవడాన్కి కారణం ఏమిటి? మీకు నచ్చిన పాత్రలు రానందువలనా? లేక. మరేదైనా కారణం వున్నదా?"

క్షణకాలం నాకేసి సూటిగా చూసి, కళ్ళు మూసుకుని మౌనంగా వుండిపోయారు. నాకేమీ తోచక ఆయన నుదుటిమీద నాట్యం చేస్తున్న వెంట్రుకలకేసి చూస్తూ, ఆయన జవాబుకోసం ఎదురు చూడసాగాను. మరో కుర్చీలో కొస్త దూరంగా కూర్చునివున్న

టప్‌మని సిగరెట్ గాలిలో పల్టీలు కొడుతూ పెదవుల మధ్య నిలిచింది.

సర్‌మంటూ అగ్గిపుల్ల వెలగడం.

అగ్గిపెట్టెఆమడదూరంలోవెళ్ళి పడడం, సిగరెట్టు వెలగడంఅన్నీ ఒక్కక్షణంలో జరిగి, గుప్‌మని పొగవదిలి, రెండడుగులు ఠీవిగా నడిచి, స్టయిల్‌గా నిలబడ్డాడు రజనీకాంత్.



రామానాయుడుగారు మమ్మల్ని చూసి, నవ్వుతూ,

"ఎలా సాగుతుంది యింటర్వ్యూ" అన్నట్టు చూసారు.

ఫర్వాలేదన్నట్టుతలాడించాను.

కాస్సేపు నిశ్శబ్దం రాజ్యం ఏలింది. బిగుసుకుపోయిన వాతావరణాన్ని సరిచేస్తూ

"ఇకనుండి తెలుగు సినిమాల్లో నటించకూడదని నిశ్చయించుకున్నాను." అన్నారు దృఢంగా రజనీకాంత్.

"ఎందుకలా నిశ్చయించుకున్నారు?" అడిగాను తెల్లబోతూ.

"నేను ఒక తెలుగు సినిమాలో నటిస్తే, అదే తెలుగు సినిమాని తమిళంలోకి డబ్ చేసి, స్ట్రెయిట్ పిక్చర్‌గా తమిళనాడులో రిలీజ్ చేస్తున్నారు. ఇది ప్రేక్షకుల్ని మోసం చెయ్యడం లాంటిది. ఒక భాషనుండి మరొక భాషలోకి చిత్రాన్ని డబ్ చేసినప్పుడు అది డబ్బింగ్ చిత్రమని ప్రేక్షకులకు తెలియచెయ్యాలి. అలా కాకుండా స్ట్రెయిట్ పిక్చర్‌గా రిలీజ్ చేస్తే, అసలు చిత్రంలోవున్న ఎఫెక్ట్స్ డబ్బింగ్ చిత్రంలో పోయి, పేలవంగాకనిపించేఆస్కారంవుంది"

"ఈయన నటన యిలా వుందేమిటి? అని ప్రేక్షకులుభావించే అవకాశం వుంది. దీనివల్ల 'ఇమేజ్' భంగపడే ఆస్కారం వుంది. అందుకనే తెలుగు సినిమాలలో నటించకూడదని అనుకుంటున్నాను" అన్న రజనీకాంత్ గారి జవాబులో, బాగా ఆలోచిస్తే నిజం లేకపోలేదని పించింది.

తన ఇమేజ్ వల్ల అంత జాగ్రత్త తీసుకోవడం వల్లనే అనతి కాలంలోనే ప్రేక్షకులందరినీ తనచుట్టూ ఆకర్షించబడేటట్టు చేయగలిగారాయన. నేడు తమిళనాడులో ప్రతి ఒక్కరూ రజనీకాంత్‌లా స్టయిల్‌గా వుండాలని, ప్రయత్నిస్తున్నారంటే, ఆయనపై జనానికెంత మోజో తెలుస్తుంది.

## రజనీ అనుకరణ

"నేడు చాలామంది ప్రజలు మిమ్మల్ని అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారుగదా - అది తలచుకున్నప్పుడు మీరెలా ఫీలవుతారని అడిగితే.

"ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ మై సెల్ఫ్" అని అన్నారు నవ్వుతూ.

మీ విజయానికి రహస్యం ఏమైనా వుందా అని అడిగినప్పుడు. "రహస్యం వున్నద"ని అన్నారు. అదేమిటో చెప్పండని ఆతృతతో అడిగాను.

"శ్రీ రాఘవేంద్రస్వామి దయ" అన్నారు.

## మంత్రాలయం


అలా అంటున్నప్పుడు ఆయన కళ్ళు వినిర్మలమై, క్షణకాలం రాఘవేంద్రస్వామిని తన మనోఫలకంపై ఊహించుకుని, నిశ్శబ్దంగా వుండిపోయారు.

రజనీకాంత్‌కి చిన్నప్పటినుండి మంత్రాలయ శ్రీ రాఘవేంద్రస్వామి అంటే అమితమైన భక్తి. ఏలాంటి కష్టంవచ్చినా, ఆయన మంత్రాలయానికివెళ్ళి, రాఘవేంద్రస్వామి సమక్షంలో వుంటారు. మనసు తేలిక పడుతుంది. అక్కడ లభించే తృప్తి మరెక్కడా లభించదని అంటారు రజనీకాంత్

## విలన్ టైప్ లైక్ చేస్తాను!


మీకు ఎలాంటి పాత్రలంటే యిష్టమని అడిగినప్పుడు

"విలన్ టైప్ పాత్రలంటే నాకు చాలా యిష్టం. అంటే బైహార్టు మంచి వ్యక్తిగాగల విలన్ టైప్ పాత్రలు. అలాంటిపాత్రల్ని పోషించడంవల్ల 'కిక్' వుంటుంది. ఏదన్నా కొత్తగా నటించడానికి ఆస్కారం వుంటుంది.



ఉదాహరణకు ఆ మ్మా యి చేతిలో తన్నులు తినవచ్చు, మున్నమూ తన్నవచ్చు. అందులో వున్న 'థ్రిల్లు' హీరో పాత్రల్లో ఏముంటుంది. హీరో అయితే ఎప్పుడూ ధర్మంగా వుండాలి. సత్యం చెప్పాలి. ఆశయాలంటూ, హైరానాపడాలి. అలాంటిపాత్రల్లో ఏ మాత్రం థ్రిల్ వుండదు" అన్నారు.

## ప్రత్యేకమైన హీరో



"సాధారణంగా మీరు నటించిన ప్రతీ పిక్చర్‌లో ఒకే విధమైన స్టయిల్‌తో నటిస్తుంటారు. బహుశా జనానికి నచ్చుతున్నది కాబట్టి అలా నటిస్తున్నారా? లేక సినిమా సినిమాకు స్టయిల్ నిమారుస్తున్నారా?"

"చూడండి. నటనలో ఒక్కొక్కరికీ ఒక విశిష్టమైన ప్రత్యేకత వుంటుంది. శ్రీ నాగేశ్వరరావు, శ్రీ రామారావు నటనను పరిశీలించండి. ఒకరివలె మరొకరు నటించరు. అలానే ఎం.జి.ఆర్ గారూ, శివాజీగారూ ఎవరి ఇండివిద్యువాలిటీ వాళ్ళదే. అలాగే నా ప్రత్యేకతను నేను చూపిస్తూ, నటిస్తున్నాను. నేను మరొకరి లాగ నటిస్తే యిక రజనీకాంత్ ఎందుకు? ఏమంటారు?" అంటూ నన్నడిగారాయన.

"మీరు చెప్పింది అక్షరాల నిజమే సుమండి. మీకు తెలుగు నటులలో నచ్చినవారు ఎవరండి?" అంటూ అడిగాను.

"ఎస్. వి. రంగారావు" తక్కుమని జవాబిచ్చారు.

"ఎందుకని?"

"నటనలో ఈజ్, ప్రత్యేకమైన స్టయిల్, రియలిస్టిక్‌గా నటించే ఎస్. వి. రంగారావుగారంటే నా కత్యంత అభిమానం" అన్నారు.

## త్వరలో తండ్రి హోదా

రజనీకాంత్ భార్య శ్రీమతి లత గర్భిణి. తనకు కొడుకుపుడితే రాఘవేంద్రస్వామి పేరు పెడతానని, కూతురుపుడితే అనూరాధ పేరు పెడతానని ఆయనా మధ్య ఒక స్టేట్‌మెంట్ యిచ్చినది జ్ఞాపకానికొచ్చి.

"మీకు కొడుకుపుడితే సినిమా రంగంలోనే ప్రవేశపెడతారా?" అని అడిగాను.

"నో! వాడినో మంచి రాజకీయవేత్తగా చెయ్యాలని కోరికగా వుంద"ని అన్నారు రజనీకాంత్.


"స్టయిల్‌కింగ్‌గా మా పాఠకులకు మీరేం చెప్పాలని అనుకుంటున్నారు?" ఇదే నా ఆఖరి ప్రశ్న అన్నట్టు అడిగాను.

"సినిమాలు చూడండి. టైం వుంటే పాత్రలగురించివ్యాఖ్యానం చెయ్యండి. పాత్రధారుల్నిగురించి చర్చించకండి. అదీ మీకు టైం లభిస్తేనే సుమా!" అన్నారు రజనీకాంత్ కుర్చీలోనుండి లేచి, షూటింగ్ స్పాట్ వద్దకు నడుస్తూ.

—ఎల్యూనారాయణరావ్

ఫొటోలు

ఆర్. సంతోష్‌కుమార్



కొత్త సినిమా

# బంగారు భూమి



ఆనగనగా ఒక అందమైన గ్రామం. పేరు సిరిపల్లె. ఆ గ్రామానికి పెద్ద ధర్మారావు (గుమ్మడి). ఆయన మాటంటే అందరికీ గౌరవం. ఆయనకో



అందాల కూతురుంది. ఆమెకు చదువుంది ; సంస్కారం వుంది. పేరు పద్మ (శ్రీదేవి).

పద్మకు రవి (కృష్ణ) అంటే ప్రాణం. అతన్ని ప్రేమించింది. అతనూ ప్రేమించాడు. రవి మారటి తల్లి అన్నపూర్ణమ్మ (కృష్ణకుమారి) పేరుకామె సవతి తల్లే గాని. రవిని ప్రాణానికన్నా మిన్నగా పెంచింది.

ఆమెకు యిద్దరు బిడ్డలున్నారు. కొడుకు సుధాకర్. (సుధాకర్) కూతురు తులసి (కవిత). భర్త పోయిన తర్వాత, రవి చేతికంది వచ్చాడని, ఇంటిపెత్తనం, కుటుంబ మంచిచెడ్డలు అన్నీ అతని చేతిలో పెట్టింది అన్నపూర్ణమ్మ. రవి కుటుంబ బాధ్యతలు, వ్యవసాయం, తల్లినీ, చెల్లినీ చూసుకుంటూ తమ్ముడు సుధాకర్‌ని పట్నంలో చదివిస్తున్నాడు.

ఆ ఊళ్ళో ఓ చందారావుగారున్నారు (రావుగోపాలరావు) ఆయనకి ధర్మారావుగారి చెల్లెల్నిచ్చారు. ఆమె ఒక మగబిడ్డ బోసుబాబుని (సత్యనారాయణ) కని పోయింది. చందారావుగారికి రాజకీయ నాయకుడుగా రాణించి, మంత్రి పదవిని చేపట్టాలని మాచెడ్డ ఉబలాటం.



ఆయనకు భవిష్యత్తు మీద బోలెడంత ఆశ. అందుకే రాబోయే ఎలెక్షన్‌లో కాబోయే ప్రెసిడెంట్‌నంటూ వుంటాడు. ఆయన సుపుత్రుడు బోసుబాబు త్రాగుబోతు, తిరుగుబోతు. అతని అసలు పేరు ఊళ్ళోవాళ్ళు మరచిపోయి చాలా కాలమయినట్టుంది. అందరూ అతన్ని దోసుబాబు అని పిలుస్తుంటారు.

కొడుకు చెడతాగి ఆడపిల్లల వెంటా, తండ్రి సూరమ్మ (సూర్యకాంతం) హోటల్లో పడి, అరువు తిండికి అలవాటు పడిపోయారు. సూరమ్మ డబ్బులడిగినప్పుడల్లా, "సూరమ్మా ! నువ్వు అక్కడే పొరబడుతున్నావ్. ఎవరు గొప్పోళ్ళో ! నువ్వు భవిష్యత్తు కనిపెట్టలేకపోతున్నావ్ ! ఎలెక్షన్‌లో నిలబడుతున్నా, మంత్రినవుతా.

నీ గుడిసె పీకించేసి, పెద్ద మేడ కట్టించేస్తాను. దాంట్లో పెద్ద హోటల్ పెట్టుకో ! నా పేరు

## కొత్త సినిమా

చెప్పుకో" అంటూ ఆ మెస్సు ఊహాలోకాల్లోకి పంపించేసి, బయటపడి సూరమ్మ హోటల్లో



మేసిన ఓపికతో ఊరంతా తన ప్రెసిడెంట్ గిరీ లెక్చరివ్వడం అతనికి రివాజయిపోయింది. హోటల్ ప్రొప్రయిట్రిక్స్ సూరమ్మకో వెర్రి కూతురుంది (మమత). వెర్రంటే వెర్రికాదు. వేపకాయంత వుంది. పాపం ఆ పిల్లకి.

* * *

పట్నంలో చదువుకుంటున్న సుధాకర్ ని ఓ పెద్ద బిజినెస్ మాగ్నట్ హరిశ్చంద్రరావు (ప్రభాకరరెడ్డి) కూతురు గీత, (గీత) ప్రేమించింది. అతనూ ఆమె ప్రేమలో పడ్డాడు. "పెళ్ళి చేసుకుందాం" అంది. అయితే "ఏ ఉద్యోగం లేకుండా నిన్నెలా పోషించాలి" అన్నాడు.

మా నాన్నతో చెప్పి మా ఇండస్ట్రీస్‌లో పెద్ద వుద్యోగం వేయిస్తానంది. ఇంటికి తీసుకొచ్చింది. తండ్రికి పరిచయం చేసింది. ఆయన మంచి ఉద్యోగం యిస్తానన్నాడు. సుధాకర్ కి అది యిష్టం లేదు. స్వయంగా తాను ఏదైనా ఇండస్ట్రీ పెడతానన్నాడు.

హరిశ్చంద్రరావుకీ అయిడియా నచ్చి, డబ్బు తాను యిస్తానన్నాడు. "అంతా మీదే అయితే నాకు బాధ్యతుండదు. నా డబ్బు కూడా కొంత పెడతాను" అన్నాడు సుధాకర్. దానికి గీత, గీత అన్న హరిబాబు, హరిశ్చంద్రరావు అంగీకరించారు. డబ్బు కోసం ఊరికెళ్తానన్నాడు. సుధాకర్ తో అతని కాబోయే భార్య గీత, బావమరిది హరిబాబు (గిరిబాబు) సిరిపల్లెకు వచ్చారు.

ఆ ఊళ్ళోనే కాసులయ్య (అల్లురామలింగయ్య) అని గొప్ప పిసినారి వున్నాడు. అతనికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు బుజ్జిబాబు (రాజబాబు). రెండోవాడు మోహన్ (ఈశ్వరరావు). బుజ్జిబాబు లోకం ఎరుగని అమాయకుడు. మోహన్ పోలీస్ ట్రైనింగ్ అవుతున్నాడు. బుజ్జిబాబు సూరమ్మ కూతుర్ని ప్రేమిస్తే – మోహన్ తులసి (కవిత)ని ప్రేమించాడు.

అన్నపూర్ణమ్మ ఓ రోజు ఏదో పనిమీద పొలం వైపు వెళ్తుంటే దారిలో చెరువు కట్ట దగ్గర తులసి, మోహన్‌ల ప్రేమాయణం చూసింది. ఇంటికి వెళ్ళింది. కూతురు రాగానే కొరడా తీసుకుంది. పరువు పోయాక బ్రతికి లాభమేముందని? ఛెళ్ళు ఛెళ్ళున, నాలుగు వాయించింది.

రవి వచ్చి అడ్డుకున్నాడు. చెల్లెల్ని అడిగాడు. 'ప్రేమ



మోహన్ నే చేసుకుంటా' నన్నది. "అతనితోనే నీ పెళ్ళి" అని, పిసినారి కాసులయ్యకి లక్ష కట్నం యిస్తానన్నాడు. తల్లిని ఒప్పించాడు.

* * *

ఇంటికి వచ్చిన తర్వాత విషయం తెలిసిన సుధాకర్ అన్న మీద విరుచుకు పడ్డాడు. "నా చెల్లెలి పెళ్ళి నాకు తెలియకుండా ఎవడో అయోగ్యుడి కొడుక్కిచ్చి చేయడం నాకు నచ్చలేదు" అన్నాడు. తల్లి, అన్న నచ్చచెప్పబోయారు.

ఎలాగైనా తులసిని మోహన్ కే ఇచ్చి చేయడానికి తీర్మానించమని, చెల్లెలు మనసు తెలుసుకోమని చెప్పారు. అతను వినలేదు. మూర్ఖంగా ప్రవర్తించేడు. నా మాటంటే మీకు లెక్కలేదు కనుక, ఇక మీకూ నాకూ కుదరదు. నా ఆస్తి నాకు పంచి యిచ్చెయ్యమన్నాడు.

సుధాకర్ మంచివాడే అయినా మూర్ఖత్వంతో, పరిస్థితిని అర్థం చేసుకోకుండా తల్లి, చెల్లి, అన్న మనసుల్ని గ్రహించకుండా అందర్నీ బాధపెట్టాడు. ఫలితంగా

# కొత్త సినిమా



ఆ ఆస్తి రెండు ముక్కలయింది.

* * *

ఇటువంటి పరిస్థితుల్లో పద్మ తనని పెళ్ళి చేసుకోమని రవిని అడిగింది. రవి ఈ వివాహం జరగదన్నాడు. నిశ్చేష్ఠురాలయింది



పద్మ. కారణం అడిగింది. చెప్పలేనన్నాడు. కూతురు పరిస్థితి గ్రహించి, తండ్రి ధర్మారావు అడిగాడు. రవి తనని వివాహం చేసుకోనన్న విషయం చెప్పింది. రవికి కబురుపెట్టాడు ధర్మారావు.

తనకి పేరుమాత్రమే మిగిలిందనీ, తన ఆస్తంతా అప్పులపాలయిందనీ, ఇటువంటి పరిస్థితులో పద్మను నువ్వు పెళ్ళి చేసుకోకపోతే ఆ పిల్ల జీవితం అన్యాయం పాలవుతుందని ప్రాధేయపడ్డాడు. రవి ఆయన పరిస్థితినీ, పద్మ మనసును అర్థం చేసుకున్నాడు. ఆమెను పెళ్ళి చేసుకున్నాడు.

* * *

కన్నవారింట దర్జా జీవితానికి అలవాటుపడ్డ పద్మ-అత్తవారింట్లో కూడా దర్జాగా బ్రతకడానికి ప్రయత్నిస్తుంది. ఆ ప్రయత్నంలో రవి ఆమెను విసుక్కుంటాడు. కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకోమని చెబుతాడు. అతని విసుగు దలకు అలకచెంది, తండ్రి ఇంటికి వెళుతుంది.

ఆస్థి అప్పులకి, ఇల్లు వేలానికి వచ్చేసరికి—అవమానం భరించలేక ధర్మారావు ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురు పద్మ, తండ్రి శవం మీద పడి ఘోరున ఏడుస్తుంటే, రవి వచ్చి ఆమె భుజంమీద చెయ్యివేశాడు. తండ్రి స్థితి ఇలా మారడానికి కారణం తెలుసుకున్న పద్మ భర్త గుండెల్లో వాలిపోయింది.

అతనిమీద ఆమెకు గౌరవం రెట్టింపు అయింది. తన తొందరపాటుకు క్షమించమని, అతనితో చేయి కలిపింది. రవి బంజరు భూమిని సాగుచేశాడు. బంగారం



అన్నను నానా మాటలూ అని వెళ్ళిన సుధాకర్—పట్నంలో నమ్మినవారు ముంచగా, నిజం తెలుసుకుని, అన్న ఇంటికి వచ్చి మన్నించమని అర్థిస్తాడు. విడిపోయిన మనసులు కలిసాయి. పోయిందనుకున్న ఆస్థి తిరిగి చేతికి వచ్చింది.


ఆ కుటుంబం ఎప్పటివలె మూడు పువ్వులూ, ఆరు కాయలు అయింది.

పాత్రధారులు: నటశేఖర కృష్ణ, గుమ్మడి, రావు గోపాలరావు, సత్యనారాయణ, ప్రభాకర రెడ్డి, అల్లు రామలింగయ్య, రాజబాబు, గిరిబాబు, సుధాకర్, ఈశ్వరరావు, శ్రీదేవి, కృష్ణకుమారి, కవిత, మమత, గీత, సూర్యకాంతం.

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం-పి. చంద్రశేఖరరెడ్డి; మాటలు-మోదుకూరి జాన్సన్; పాటలు-ఆచార్య ఆత్రేయ, వేటూరి; సంగీతం—జె.వి. రాఘవులు; ఫొటోగ్రఫీ - పుష్పాల గోపీకృష్ణ; ఎడిటింగ్ వి. జగదీష్; కో డైరెక్షన్-మన్నె రాధాకృష్ణ; నిర్మాత-ఎస్.పి. వెంకన్నబాబు. ❀ ❀ ❀



# ఇరవయ్యేళ్ళ చిన్నది



సాయంత్రం ఆరు గంటలు. వాతావరణం జయమాలినిలా చాలా చక్కగావుంది. ఆ వేళ (22-12-81) జయమాలిని బర్త్‌డే. న్యూ ఉడ్‌లాండ్స్ హోటల్‌లో ఫంక్షన్ ఏర్పాటుచేసింది.

"విష్‌యూ మెనీమెనీ హేపీ రిటర్న్స్ అండ్ మెనీమెనీ హేపీరిటర్న్స్ ఆవ్ ది డే!" అభినందించారొక పెద్దమనిషి. ఆమాటలు వినగానే కీఇచ్చినట్లు గిర్రున వెనక్కి తిరిగి చూసాను.

"థాంక్యూ!" అంటూ నవ్వుల నయాగారాల్ని చిందిస్తూ సగ్గుల మొగ్గల నిగ్గులుపోతూ నిలబడివుంది జయమాలిని.

బ్రౌన్ కలర్ పట్టు లంగా, పింక్ కలర్ పట్టు వోణీలో ఈ బట్టలు నాకు సరిపోవడంలేదన్నట్లువుంది. జడలో [illegible] బారెడు, దానికింద మణుగు బరువున్న మల్లెపువ్వులు. మెడలో కాసుల పేరు. మోచేతిదగ్గర వంకీలు. వడుముకు వడ్డాణం [illegible] కాళ్ళకు గజ్జెలు... ఓహో!

"ఇరవై కొవ్వొత్తులున్నాయ్ గురూ!" అన్నాడొక జర్నలిస్టు సీరియస్‌గా లెక్కబెట్టేస్తూ.

"తట్! పందొమ్మిదే వున్నాయ్!" కొవ్వొత్తుల్ని లెక్కబెట్టడంలో నేనే సమర్థుడినన్నట్లు చూస్తూ అన్నాడు మరో జర్నలిస్టు.

ఇలా వీళ్ళిద్దరికీ అభిప్రాయ బేధాలొచ్చేసరికి నేనుకూడా లెక్కబెట్టాను. అదేమిటోగాని నాకళ్ళకు మాత్రం పదహారు కొవ్వొత్తులే కల్పించాయి. కళ్ళునులుముకుని మళ్ళీచూసేసరికి పదిహేనే కనిపించాయి.

సరిగా అదేసమయంలో జయమాలిని ఇరవై ఒకటవ పుట్టినరోజు ఇది. లెటజ్ విష్ ఆల్ సక్సెస్ ఇన్ హర్ లైఫ్ అన్న ప్రకటన వెలువడింది. 'హమ్మయ్య' అని తేలిగ్గా నిట్టూర్చాను.

శ్రేయోభిలాషుల శుభాభినందనలమధ్య కిలకిల నవ్వుతూ కేక్ కట్ చేసింది జయమాలిని. బర్త్‌డే బేబీకి అందరూ (ఐ మీన్ కొందరు) కేక్ ని తినిపించారు.

అల్పాహారం అనంతరం ఎ.వి. రమణన్ పార్టీ తెలుగు, తమిళం, ఇంగ్లీషు, హిందీసినిమా పాటల్ని పాడి అందరినీ ఆనందింపచేసారు. ❀



# సినీ మా డైరీ



గీత
35, సౌత్ వెస్ట్ బోగరోడ్,
మద్రాస్—600017.
పుట్టిన తేదీ : జూలై 14



అల్లు రామలింగయ్య
14, రామకృష్ణ స్ట్రీట్,
మద్రాస్—600017.
ఫోన్ : 442188
పుట్టిన తేదీ : అక్టోబరు 1




సుధాషిణ
17, పార్ధసారధిపురం,
మద్రాస్—600017.
ఫోన్ : 443530
పుట్టిన తేదీ : ఆగస్టు 2



గుమ్మడి వెంకటేశ్వరరావు
33, హబిబుల్లా రోడ్,
మద్రాస్—600017.
ఫోన్ : 442241
పుట్టిన తేదీ : జూలై 9



కె. జగ్గయ్య
85, సెకండ్ అవెన్యూ,
అన్నానగర్, మద్రాస్—40
ఫోన్ : 613404
పుట్టిన తేదీ : డిసెంబరు 31



## వర్ధమానతార

## మూడు భాషల్లో తప్పటడుగులు వేస్తున్నాను

—మణిశ్రీ

తెలుగు, తమిళ, కన్నడ చిత్ర రంగాలలో తప్పటడుగులేస్తూ, వర్ధమానతారల కాంపిటీషన్‌లో తనకంటూ ఓ ప్రత్యేకస్థానాన్ని ఏర్పరచుకోవటానికి శతవిధాల ప్రయత్నిస్తున్న వర్ధమాన తారా మణి మణిశ్రీ.

మణిశ్రీ రూపురేఖల్లో కొంచెం మహానటి వాణిశ్రీని పోలి వుంటుంది. ఈమె వయసు ఎంత అని గత సంవత్సరం అడిగితే పందొమ్మిది సంవత్సరాలు అంది.

ఈమె గతంలో "అల్లరి బుల్లోడు", "కుమారరాజా", "భలే అల్లుడు", "వధూవరులు", "కలియుగ సీత" చిత్రాల్లో గుర్తింపు కలిగిన పాత్రలు పోషించింది.

తెలుగు ఆడపడుచు అయినా ఈమెకి తమిళ, కన్నడ భాషలు క్షుణ్ణంగా తెలుసా ? అని అడిగినపుడు "యిప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాను. అయినా నటనకి భాష ముఖ్యం కాదు. టాలెంట్ ముఖ్యం. నాలో టాలెంట్ వుంది. తెలుగువారు కాకపోయినా కమల్ హాసన్, రజనీకాంత్‌లు మన తెలుగు వారి అభిమానాన్ని సంపాదించుకోలా ?" అని తిరిగి నన్నే ప్రశ్నించింది !


• ఈమె అభిమాన నటీమణులు సావిత్రి, వాణిశ్రీ అంది. తన అభిమాన నటీమణుల్లా తెలుగు చిత్ర రంగంలో మణిశ్రీ తనకంటూ ఓ మహోన్నత స్థానాన్ని ఏర్పరచుకోగలదని ఆశిద్దాం.

—శశిమోహన్

❋ ❋ ❋

Edited and published by T. Chandrasekhar Reddy, on behalf of Deccan Chronicle from 36, Sarojini Devi Road, Secunderabad —3.
Printed at Shilpi Graphics Pvt. Ltd., Secunderabad — 500 003.


రామకృష్ణా సినీ స్టూడియోస్
అనురాగదేవత
కలర్
నిర్మాత
దర్శకత్వం
కెమెరా
హరికృష్ణ - తాతినేని రామారావు - నందమూరి మోహనకృష్ణ
నైజాం: రామకృష్ణ


అక్కినేని
దాసరి నారాయణరావు
దాసరి నారాయణరావు
రాగదీపం
వీరరాణీ ఎంటర్‌ప్రైజెస్
VEERARANI ENTERPRISES
సంగీతం చక్ర